1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

శుక్రవారం | సెప్టెంబర్ 01 2023 | www.navatelangana.com

కేజీబీవీలో ఖాళీల భర్తీకి 2న ధృవపత్రాల పరిశీలన



నవ తెలంగాణ-సిద్దిపేట

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీకి రోస్టర్ పద్ధతిలో 1:3 ప్రకారం అభ్యర్థుల నిజధృవ పత్రాల పరిశీలన సెప్టెంబర్ 2న పరిశీలిం చడం జరుగుతుందని డీఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సిఆర్‌టి బయో సైన్సు 2, ఫిసికల్ సైన్స్ 1, ఇంగ్లీష్ 1, సోషల్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన వారు సిద్ధిపేట పట్టణంలోని పాత డీఈఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి నిజ ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, అక్కడికి హాజరు కావాలని సూచించారు. అర్హులైన అభ్యర్థుల జాబితా డీఈవో సిద్ధిపేట డాట్ ఇన్‌లో పొందుపరచబడుతుందని, ఖాళీల భర్తీకి సంబంధించిన వివరాలు అన్ని ఇదే వెబ్ సైట్‌లో పొందుపరచబడునని, అర్హులైన అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కాగలరని సూచించారు.

ఆసుపత్రికి వైద్య పరికరాల అందజేత



నవతెలంగాణ జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పారిశ్రామిక ప్రాంతమైన గడ్డపోతారం గ్రామపంచాయతీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి ఆసుపత్రి సౌకర్యార్థమై వివిధ రకాలైన వైద్య పరికరాలను సాయంగా అందించారు. దాదాపు 50 వేల పైచిలుకు విలువ గల పరికరాలను ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి, ఆస్పత్రి సిబ్బంది బృందానికి ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి వెంట వార్డు సభ్యులు వీరేష్, గడ్డపోతారం గ్రామపంచాయతీ సిబ్బంది శ్రీనివాస్, జిన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం పాల్గొన్నారు

ఉత్తుత్తి నిషేధం

- ఏడాదైనా అమలుకాని ప్లాస్టిక్ నిషేధం
- యథేచ్ఛగా ప్రమాదకర ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వాడకం
- ఉమ్మడి జిల్లాలో టన్నులకొద్ది పాథిలిన్, ప్లాస్టిక్ వినియోగం
- ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాల కుప్పలే
- జనపనార, వస్త్ర సంచుల తయారీపై దృష్టి పెట్టని వైనం





పర్యావరణ సమస్య గురించి అంతర్జాతీయ, జాతీయ వేదికల్లో కీలకమైన ఎజెండాగా చర్చిస్తున్నమంటే వాతావరణ సమతుల్యత ఎంత పాడైందో అర్థమవుతోంది. పర్యావరణ కాలుష్యం వెదజల్లే అంశాలు అనేకం ఉన్నాయి. అందులో మనపాత్ర ఎంత అనేది ఎవరికివారమే గుర్తించాల్సిన బాధ్యత ఉంది. 120 మైక్రాన్లకంటె తక్కువ మందమున్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర వస్తువుల్ని వాడకూడదు. తయారు చేయకూడదని ప్రభుత్వం నిషేధించింది. నిషేధమున్నా ఎక్కడా అమలు కావడం లేదు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ వ్యర్థాల కుప్పలు తెప్పలుగా పోగవుతూనే ఉన్నాయి. పారిశ్రామిక ప్రాంతం కావడంతో ప్లాస్టిక్ వాడకం కూడా అధికంగా ఉంటోంది. నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల్ని తయారు చేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు. విచ్చల విడిగా వాడుతున్నా అరికట్టే దిక్కులేదు. మూడు జిల్లాలోని మున్సిపాలిటీలు, పట్టణ, మండల కేంద్రాల్లోనే కాకుండా గ్రామాల్లో సైతం నిషేదిత ప్లాస్టిక్ వాడకం జోరుగా సాగుతోంది.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలో పేరుకుపోయే చెత్తచెతారం కుప్పల్లో ప్లాకిస్ కవర్లు, గ్లాసులు, ఇతర వస్తువులే అధికంగా ఉంటున్నాయి. రోజువారిగా ఎత్తిపారేసే చెత్తంతా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతుంది. సంగారెడ్డి జిల్లా పరిధిలోని ఏనిమిది మున్సిపాలిటీల్లో నిషేదిత ప్లాస్టిక్ వస్తువల్ని వినియోగిస్తున్నారు. సంగారెడ్డి, పటాన్‌చెరు అమీన్‌పూర్, జహీరాబాద్, అందోల్-జోగిపేట, నారాయణఖేడ్, సదాశివపేట, తెల్లాపూర్, బొల్లారం వంటి పట్టణాల్లో నిషేదిత ప్లాస్టిక్ వినియోగం యధేచ్ఛగా సాగుతోంది. సిద్ధిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, నర్సాపూర్, మెదక్, రామాయంపేట వంటి పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్లాస్టిక్ వాడకం అధికంగా సాగుతోంది. ముఖ్యంగా వ్యాపార సముదాయాలు, చిరు వ్యాపారాలు జరిగే చోట వస్తువుల్ని తీసుకెళ్లేందుకు ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారు. శుభ, అశుభ కార్యాలకు గ్లాసులు, ప్లేట్స్‌ను మాత్రమే వాడుతున్నారు. ఫైబర్, స్టీల్ ప్లేట్లు, గ్లాసుల్ని వాడే పద్దతి లేకుండా పోయింది. పారిశ్రామిక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగం కూడా బాగానే ఉంటుంది. ఆసుపత్రుల వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లోనూ నిషేదిత ప్లాస్టిక్ వస్తువుల్ని వినియోగిస్తున్నారు. వాడిన తర్వాత వాటిని చెత్తలో పడేస్తుండడంతో భూమి పొరల్లో చేరుతున్నాయి.

నిషేదమున్నా పట్టని వైనం

ప్లాస్టిక్ వినియోగంలో తగిన జాగ్రతలు తీసుకోవాలి. కొన్ని రకాల ప్లాస్టిక్ వస్తువుల్ని వినియోగించడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు పర్యావరణానికి కూడా ముప్పువాటిల్లుతుంది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం 21 రకాల నిషేద వస్తువుల జాబితాను ప్రకటించింది. గతేడాది జులై 1 నుంచి ఆ జాబితాలో ఉన్న ప్లాస్టిక్ వస్తువుల్ని వాడకూడదంటూ నిషేదించింది. వాటిల్లో గ్లాసులు, ఫోర్సులు, ప్లాస్టిక్ చాకులు, ట్రేలు, ఇయర్‌బడ్స్, బెలూన్స్, జెండాలు, థర్మకోల్ డెకరేషన్ వస్తువులతో పాలు ఇతర వస్తువుల్ని నిషేదిత జాబితాలో చేర్చారు. 2022 సెప్టెంబర్ నుంచి 75 మైక్రాన్ల కంటు తక్కువ మందమున్న పాథిలిన్ కవర్లపై నిషేదం విధించారు. అదే ఏడాది డిసెంబర్‌లో కూడా 120 మైక్రాన్ల కంటె తక్కువ మందమన్న ప్లాస్టిక్ కవర్లను కూడా నిషేదిచారు.

టన్నుల కొద్ది పాథిలిన్, ప్లాస్టిక్ వినియోగం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టన్నుల కొద్ది పాథిలిన్ ప్లాస్టిక్ వకర్లను వినియోగిస్తున్నారు. ఆయా పట్టణాలను పరిశీలిస్తే సంగారెడ్డి, సిద్ధిపేటలో 16 నుంచి 18 టన్నుల వరకు పాథిలిన్, ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. జహీరాబాద్, గజ్వేల్, మెదక్ వంటి పట్టణాల్లో 10 టన్నులు, సదాశివపేట, అమీన్‌పూర్ పట్టణాల్లో 8 టన్నుల చొప్పున వినియోగిస్తున్నారు. నారాయణఖేడ్, తెల్లాపూర్, బొల్లారం, దుబ్బాక, నర్సాపూర్, రామాయంపేట, అందోల్-జోగిపేట, చేర్యాల, హుస్నాబాద్ ఇతర పట్టణాల్లో 3 నుంచి 4 టన్నుల వరకు పాథిలిన్, ప్లాస్టిక్ వరకు వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సగటున 120 టన్నుల వరకు పాథిలిన్, ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇంత పెద్ద ఎత్తున వాడుతున్నప్పటికీ నిషేదిత వస్తువుల్ని అరికట్టడంలో అధికార యంత్రాంగం పట్టీపట్టనట్లు ఉంటోంది.

ప్రత్యామ్నాయం, అవగహన పట్ల అశ్రద్ద

నిషేదిత ప్రమాదకరమైన ప్లాస్టిక్ వస్తువుల్ని వినిగించకూడదన్న అవగహనా కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. మొక్కుబడి కార్యక్రమాలు తప్ప నిర్దిష్టమైన కార్యాచరణతో ప్రజల్లో అవగహన కల్పించడంలో విఫలమవుతున్నారు.

అదే విధంగా ప్రత్యామ్నాయ వస్తువుల ఉత్పత్తికి తగిన ప్రోత్సహం కూడా లేదు. డీఆర్‌డీఎ ద్వారా మహిళా సంఘాలకు శిక్షణ ఇవ్వడంతో పాటు బ్యాంకుల ద్వారా రుణాలిప్పిస్తే ప్రత్యామ్నాయ వస్తువుల్ని తయారు చేయవచ్చు. జనపనార, వస్త్రంతో సంచులు తయారు చేసి మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకురావడం ద్వారానే నిషేదిత ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని అరికట్టే అవకాశముంది. వీటిపైన మున్సిపాలిటీ, మండల పరిషత్ పాలక వర్గాలు దృష్టి సారించాలి. అదే విధంగా ప్రమాదకరమైన ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువుల్ని తయారు చేస్తున్న సంస్థలపై ఏలాంటి దాడులు చేయట్లేదు. వాటిని వినియోగిస్తున్న పెద్ద పెద్ద వ్యాసార సంస్థల పట్ల కూడా ఉదాసీనత కనిపిస్తుంది.

అన్నా రాఖీ కడత.. లేవు

- రాఖీ పండుగ రోజు అన్న కన్నుమూత
- కన్నీరు మునిరైన చెల్లెల
- ఆవంచ గ్రామంలో విషాదం



నవతెలంగాణ నర్సాపూర్

రాఖీ పండుగ వేళ.. ఒక్కగానొక్క అన్నకు రాఖీ కట్టాలని బయలుదేరి వచ్చారు. అక్కాచెల్లెళ్లు ఇంటికి చేరుకోగానే పిడుగు లాంటి మరణ వార్త వినాల్సి వచ్చింది. రాఖీ కట్టడానికి అన్న లేడని తెలిసి గుండెలవిసేలా ఏడ్చారు. అన్నా... లేవు.. రాఖీ కడతాం.. అంటూ చెల్లెళ్ల ఇద్దరూ చేసిన రోదనలు అక్కడున్న వారందరని కలిచివేసాయి. ఈ సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో గురువారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆవంచ గ్రామానికి చెందిన కొండి జగన్(45) అనారోగ్యంతో గత కొన్ని రోజులుగా బాధపడుతున్నాడు. గురువారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో మృతి చెందాడు. పండుగను పురస్కరించుకొని అతని ఇద్దరి చెల్లెళ్ల నరసమ్మ, అంబిక రాఖీ కట్టేందుకు సంతోషంతో వచ్చినా వారికి విషాదం ఎదురయింది. సంతోషంగా రాఖీ కడదామని వస్తే మాకు లేకుండా పోయావా... అన్న అంటూ మృతదేహం వద్ద రోదిస్తుండడంతో అక్కడున్నవారంతా కంటతడి పెట్టారు. దీంతో ఆవంచ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

జిల్లాలో నెల రోజులపాటు పోలీసు యాక్ట్ అమలు

ఎస్పీ ఎం.రమణకుమార్



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (సెప్టెంబర్ 1వ తేది నుండి 30 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని ఎస్పీ ఎం.రమణ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

గీతంలో త్రీ ఇడియట్స్ చిత్ర ప్రదర్శన



నవతెలంగాణ-పటాన్‌చెరు

అభిజాత్ జోషి కలం నుంచి పురుడు పోసుకుని, రాజ్ కుమార్ హిరానీ దర్శకత్వంలో, విధు హెూనోద్ చోప్రా నిర్మించిన సూపర్ డూపర్ హిట్ చిత్రం త్రీ 'ఇడియట్స్'ను గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రదర్శించారు. ఈ చిత్రం న్యూయార్క్ లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో కూడా ప్రత్యేకంగా ప్రదర్శించిన విషయం విదితమే.విద్య పై ముఖ్యమైన సందేశంతో కూడిన చిత్రంగా 3 ఇడియట్స్' పరిగణించ బడుతుంది.ఈ చిత్రం, అందులోని ప్రతి పాత్రా తమ జీవితాలను ఎలా ప్రభావితం చేసింది అనేదానిని గీతం విద్యార్థులు దృష్టి సారించడంతో పాటు ఆ చిత్రాన్ని ఆసాంతం శ్రద్ధగా వీక్షించారు.అమీర్ ఖాన్, ఆర్.మాధవన్, శర్మన్ బోసి, కరీనా కపూర్, బోమన్ ఇరానీ, ఓమి వైద్య తదితరులు నటించిన ఈ చిత్రం హిందీ భాషలో ఆంగ్ల ఉపశీర్షికలతో ప్రదర్శించబడింది.

గ్రామ సింహాల స్వైర విహారం





నవతెలంగాణ - నార్సింగి

మనిషి మచ్చిక చేసుకున్న జంతువులలో కుక్క మొదటిదంటారు. కాపలా కాయడంలో వాటికి ఏ జంతువు సాటి రాదు. అందుకేనేమో వాటిని గ్రామ సింహాలు అని కూడా అంటారు. వికిపిడియా అనుసారం ప్రపంచ వ్యాప్తంగా 450 జాతుల కుక్కలు ఉన్నాయి. చాలా మంది కుక్కలను ఎంతో ఇష్టంగా పెంపుడు జంతువుగా పెంచుకుంటారు. పెంపుడు కుక్క అయినా.. వీధి కుక్క ఆయినా కరిస్తే దాని నోటి నుండి బ్యాక్టీరియా మానవ శరీరంలోకి ప్రవేశించవచ్చు. శరీరంలో బ్యాక్టీరియా ఉండి పోతేదాని వల్ల టేటనస్, రెబిస్, లేదా సెప్సిస్ లాంటి ఇన్ఫెక్షన్ కారణ మవుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచంలోని రేబిస్ మరనాలలో ప్రతి సంవత్సరం 36 శాతం మన భారత దేశంలోనే సంభవిస్తున్నాయి. కుక్క కాటు మన దేశం లో ఎంత తీవ్రంగా ఉందో ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు తెలుపుతున్నాయి. నార్సింగి మండల కేంద్రం లో కుక్కల బెడద అధికంగా ఉంది. గ్రామంలో నీ అన్ని వార్డులలో ముఖ్యంగా 3,5,6,14 వార్డులలో చాలా ఉంది. రోడ్డు ల పై వస్తూ పోతున్న వారిపై కుక్కల దాడులు పెరిగి పోతున్నాయి. వాహన దారుల వెంట పరుగులు తీస్తూ ప్రమాదాలు జరగడానికి కారణమవుతున్నాయి. ఇక చిన్న పిల్లలు, బడి పిల్లల పరిస్దితి వర్ణనాతీతం. పలు మార్లు వారి వెంట పడిన కుక్కలను సమయానికి పెద్దలు తరిమివేయడం, ఎవ్వరు లేక పోతే వారిని కుక్కలు కాటు వేయడం సాధారణ విషయంగా మారి పోయింది. నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఈ ఒక్క ఆసుపత్రి లోనే ఆగస్ట్ 1 నుంచి 30 వరకు 21 కుక్క కాటు కేసులు వచ్చాయంటే కుక్కల బెడద ఏ పాటుగా ఉందో అర్థం చేసుకోవచ్చు. స్థానిక ప్రజలు ఎన్నో సార్లు తమ గోడు గ్రామ అధికారులకు విన్నవించుకున్నా తమను పట్టించుకునే నాథుడే లేరని వాపోతున్నారు. సంభందిత అధికారులు ఇకనైనా స్పందించి కుక్కల బెడదను నివారించాలని కోరుతున్నారు.

ఇలా చేయాలి



కుక్క కాటుకు గురైతే గాయమైన ప్రదేశాన్ని సబ్బు తో కడగాలి. వెంటనే దగ్గరలోని ఆసుపత్రిని సంప్రదించి టీ.టీ ఇంజెక్షన్, ఒక వేళ కరిచిన కుక్క పిచ్చి కుక్క అయితే ఖచ్చితంగా ఏంటి రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్వి) 4 డోసు లు 1, 3, 7, 21వ రోజులలో తీసుకోవాలి. సాధారణంగా రేబిస్ సోకిన కుక్కల కాటు వల్లనే రిబిస్ సోకే ప్రమాదం ఉంది. కాటు వేయకుండా గీరడం మాత్రమే జరిగితే వ్యాక్సిన్ అవసరం లేదు. అనవసర భయాలకు లోనూ కాకుండా వైద్యుల సూచనలు పాటించాలి. నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుంది, ఆవసరమైన వారు ఆసుపత్రి పని వేళలో సంప్రదించి తీసుకోవచ్చు. కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో జాగ్రత్త వహించాలి.

- దాక్టర్ వై రవికుమార్, నార్సింగి మండల వైద్య ఆరోగ్య అధికారి

మా దృష్టికి వచ్చింది



గ్రామంలో కుక్కల బెడద ఉన్న మాట వాస్తవం. మా దృష్టి కి కూడా సమస్య వచ్చింది. గతంలో లాగా కుక్కలను చంపడానికి వీలు లేదు, త్వరలోనే గ్రామ పంచాయితీ పాలక వర్గ సమావేశం లో చర్చించి సమస్య పరిష్కారం చేసేందుకు కృషి చేస్తాం.

- వెంకటేష్, ఈ.ఓ. నార్సింగి గ్రామ పంచాయతీ

భయంగా ఉంది



కుక్కల వల్ల చాలా భయంగా ఉంది. కిరాణా కొట్టుకు వెళ్ళిన నా కొడుకు వెంట కుక్కలు పడి కరిచాయి. పిల్లలను బయటకు పంపాలంటే భయంగా ఉంది. బడి కి పంపాలన్నా మేమే దగ్గరుండి దించి రావలసి వస్తుంది. పని ఉండి ఎక్కడైనా వెళితే, పిల్లల కోసం భయంగా ఉంటుంది. చాలా సార్లు ఈ విషయం గురించి చెప్పాం. ఎవ్వరు పట్టించుకోవడం లేదు. ఇకనైనా స్పందించి కుక్కల నుంచి మాకు మా పిల్లలకు రక్షణ కల్పించాలి.

- బషీర్ ఖురేషి, 5వ వార్డు, నార్సింగి

కుక్కలు చాలా ఉన్నాయి



నార్సింగి లో కుక్కల సంఖ్య రోజు రోజుకు అధికమవుతుంది. రోడ్ల పై, సందులలో ఎక్కడ చూసినా కుక్కలే కనిపిస్తున్నాయి. బండి పై ప్రయానిసున్నా వెంట బడుతున్నాయి. బండి నడిపే టప్పుడు వెంట పడటం వల్ల, అడ్డం రావడం వల్ల కింద పడి గాయాలు అయ్యే ప్రమాదం ఉంది. కరిచినా ఇబ్బందే. పిల్లల కు ఎక్కడికి పంపాలన్నా భయం వేస్తున్నది. మా వార్డులో కుక్కలు చాలా ఎక్కువగా ఉన్నాయి.

- జోగు జీవన్ కుమార్, 14వ వార్డు, నార్సింగి

వావిలాల పీఏసీఎస్ డైరెక్టర్‌గా భారతమ్మ



నవతెలంగాణ జిన్నారం

జిన్నారం మండల పరిధిలోని వావిలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉప ఎన్నికలో డైరెక్టర్‌గా గడ్డపోతారం గ్రామపంచాయతీకి చెందిన భారతమ్మ ఎన్నికయ్యారు. ఈ మేరకు వావిలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చేరి కారి శంకర్ రెడ్డి, ఎన్నికల అధికారులు చిన్న, సెక్రటరీ శ్రీనివాస్, వార్డు సభ్యుల ప్రసన్న సత్యనారాయణ, మాదారం మమతా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. వావిలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తొమ్మిదో వార్డు డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు గడ్డపోతారంపంచాయతీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి, పిఏసిఎస్ చైర్మన్ శంకర్ రెడ్డి, అధికారులకు, గడ్డపోతారం పంచాయతీ పరిధి ప్రజలకు భారతమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

ట్రైడెంట్ చక్కెర కర్మాగారం రన్ చేయండి





- రైతులకు, కార్మికులకు న్యాయం చేయండి
- నాడు ప్రభుత్వపరంగా అత్యధిక లాభాలు సంపాదించిన సంస్థ

నవ తెలంగాణ జహీరాబాద్

నాడు ప్రభుత్వ పరంగా కొనసాగిన ఎన్ఎస్ఎఫ్ పరిశ్రమ ఉమ్మడి రాష్ట్రంలోనే లాభాల ఆర్జన్లో తనకంటూ గుర్తింపు పొందింది. ఈ పరిశ్రమలో నేడు క్రషింగ్ కొనసాగుతుందో లేదో ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో నాటి టిడిపి ప్రభుత్వం కారు చౌకగా విక్రయించిన విషయం తెలిసిందే. నాటినుండి నేటి వరకు రైతులకు రకరకాల ఇబ్బందులకు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతమున్న ట్రైడెంట్ చక్కెర యజమాన్యం సంవత్సరానికి ఒక యజమాన్యం మారడంతో అటు కార్మికులకు ఇటు రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే ట్రైడెంట్ యజమాన్యం పరిశ్రమకు సంబంధించిన 55 ఎకరాల భూమిని విక్రయించి నా విషయం తెలిసిందే. ప్రస్తుతం పరిశ్రమ ఆవరణలోని వాహనాలు బండ్లు నిలబెట్టే యాద్దు విక్రయించేందుకు కుట్ర పన్నుతుంది ఈ కుట్రను తిప్పి కొట్టేందుకు స్థానిక రైతులు కార్మికులు సమన్వయంతో ఉద్యమ రూపాన్ని దాల్చుతున్నారు. ఇటీవలే అధికారులు యార్డు స్థలాన్ని విక్రయించేందుకు చూపడంతో రైతులు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు కార్మికులు సమన్వయంతో సమావేశాన్ని కూడా ఏర్పాటు చేసి నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా జహీరాబాద్ ప్రాంతానికి చెందిన టీజర్ 5 పరిశ్రమలో వాటర్ కొనుగోలు చేసి రైతులకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించేందుకు ముందుకు వచ్చి 90% డబ్బులు చెల్లించారు . కానీ మంత్రి హరీష్ రావుతో పాటు జిల్లా అధికారుల సమక్షంలో ముందు రైతులకు బకాయి పడ్డ డబ్బులు చెల్లించి కార్మికుల డబ్బులు చెల్లించి ఈ సంవత్సరం చెరుకును గాను గాడిస్తామని హామీ ఇచ్చారు. సెప్టెంబర్ నెల ప్రారంభమైనప్పటికీ నేటికీ పరిశ్రమ ఆవరణలో కనీస మరమ్మత్తులు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు. జహీరాబాద్ ట్రైనింగ్ చక్కెర పరిశ్రమ జూన్ పరిధిలో సాగుచేసిన మొత్తం చెరుకును గాను గాడించాలంటే పరిశమ యజమాన్యం ఇప్పటికే మరమ్మత్తుల పరులు ప్రారంభించాల్సి ఉండేది కానీ ఆ పరిణామాలు ఎక్కడ కనిపించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు.

పరిశ్రమను ప్రభుత్వమే నడిపించాలి

ఎన్ఎస్ఎఫ్ పరిశ్రమలన్నింటిని కొనుగోలు చేస్తానని ముఖ్యమంత్రి తన హామీని నిలబెట్టుకొని జహీరాబాద్ ప్రైవేట్ పరిశ్రమను ప్రభుత్వపరంగా నడిపించాలని అన్ని పక్షాల నుండి డిమాండ్ వస్తుంది. ట్రైడెంట్ చక్కర కర్మాగారన్ని విక్రాయించరాదని పలువురు కోరుతున్నారు. పక్కనే ఉన్న యార్డ్ ను కూడా విక్రయించేందుకు చేస్తున్నటువంటి ప్రక్రియను విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. యార్డ్ లేకపోతె చెరుకు బండ్లు, ట్రాక్టర్, లారీలు ఎక్కడ నిలుపుతారని రైతులు ప్రశ్నించారు. కర్మాగారం నడిపే అవకాశం లేకపోతె ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ పరంగా నడపాలని అభిప్రాయం వ్యక్తం చేసారు. ప్రభుత్వం ఉధాసిన వైఖరి విడాలని కోరారు. జాహీరాబాద్ ప్రాంతంలో అత్యధికంగా చెరుకు పంటను సాగు చేస్తారు. కర్మాగారం పొతే చెరుకు ఎక్కడికి తరలించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

కార్మికులకు నేటికు అందని జీతాలు

కార్మికులకు గత ఐదు నెలల జీతం ఇవ్వలేదని వాపోయారు. పిఎఫ్ పరిస్థితి దారుణంగా ఉందని కంట నీరు పెట్టారు. కార్మికుల, రైతుల ఉసురు పోసుకోవద్దని హేచ్చరించారు. జాహిరాబాద్ లో సమావేశం ఏర్పాటు చేసి. భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పెద్ద ఎత్తున రైతులు, కార్మికులు ఉద్యమించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నూతన మేనేజ్మెంట్ నడిపించగలదా?

చక్కెర పరిశ్రమలో ఎలాంటి అనుభవం లేనటువంటి స్థానికుడైన వ్యాపారవేత్త పరిశ్రమలు పలు షేర్లు కొని రైతులకు చెల్లించాల్సిన డబ్బులను చెల్లించారు కానీ చక్కెర ఉత్పత్తి ఎగుమతి ప్రాసెసింగ్ సంబంధించి ఎలాంటి అనుభవం లేనటువంటి నూతన మేనేజ్మెంట్ ఈ సంవత్సరం క్రషింగ్ చేయగలదా అని రైతుల అనుమాన వ్యక్తం చేస్తున్నారు.

డాక్టర్ చంద్రశేఖర్ కొనేందుకు ఆసక్తి

ఇటీవలే జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వస్తానంటున్న మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పరిశ్రమను తాను కొనుగోలు చేసి రైతులను కార్మికులను ఆదుకుంటానని హామీ ఇవ్వడంతో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గజ్వేల్ పట్టణంలో కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య



నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ పట్టణంతోపాటు రాజీవ్ రహదారిపై రోడ్డు మధ్యన పెట్టిన కోనో కార్పస్ చెట్లను తొలగించాలని, ప్రజలను శ్వాసకోశ వ్యాధుల నుండి రక్షించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ పండ్ల చెట్లు లేకపోవడం మూలంగా కోతులు గ్రామాలు పట్టణాలలో ఉంటున్నాయని ఎన్నోసార్లు చెప్పినా ముఖ్యమంత్రి పిట్ట వాలని చెట్లను కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎందుకు పెట్టారని విమర్శించారు. అనేక దేశాలు కోనో కార్పస్ చెట్లను తొలగించడం జరిగిందని, గజ్వేల్ చుట్టుపక్కల మొత్తం కోన కార్పస్ చెట్లు పెట్టి ప్రజల జీవితాలతో చెలగాడమాడుతున్నారని అన్నారు. ఈ చెట్ల ద్వారా విడుదలైన గాలి చిన్న పిల్లలకు ముసలి వాళ్లకు తొందరగా వ్యాధులు సంక్రమించడంతోపాటు శ్వాసకు వాటంకం ఏర్పడుతుందని ఆరోగ్య నిపుణులు తెలిపారని అన్నారు. రాష్ట్రంలో ఈ రోగాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుందని దగ్గు జలుబు గొంతులో సమస్యలు ఏర్పడుతున్నాయని ఆర్ఎస్వి ఇలాంటి వైరస్లు రకరకాల వైరస్ ఇన్ఫెక్షన్ చేస్తున్నాయని అన్నారు. కోను కార్పస్ బయలుగా ప్రత్యమ్నయ చెట్లను ప్రోత్సహించి ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కాపాడే విధంగా చెట్లు నాటించాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
శుక్రవారం | సెప్టెంబర్ 01 2023 | www.navatelangana.com

రోడ్డుకు అడ్డంగా భారీ వాహనాలు



- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు

నవతెలంగాణ-హత్నూర

మండలంలోని మల్కాపూర్ గ్రామ శివారులో గల సువర్ణ దుర్గా పేపర్ మిల్ కంపెనీ ఎదుట నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం నుంచి భారీ వాహనాలు నిలిపారు. పరిశ్రమలో తయారైన ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు లేదా పేపర్ తయారీకి అవసరమైన ముడిసరుకును దిగుమతి చేసుకునేందుకు వచ్చిన వాహనాలు ఒక్కసారిగా రోడ్డుపై నిలిచిపోవడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పేపర్ మిల్ కంపెనీకి సంబంధించిన భారీ వాహనాలు ఇటీవల తరచుగా రోడ్డుకడ్డంగా నిలుస్తుండటంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.ఏదైనా ప్రమాద ఘటన సంభవిస్తే తీవ్ర ప్రాణనష్టం జరిగే ఆస్కారముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యం ప్రత్యేక చొరవ తీసుకుని కంపెనీ వాహనాలను రోడ్డుపై బారులు తీరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జోగిపేటలో శివధనస్సు ఊరేగింపు

నవతెలంగాణ-జోగిపేట



రాఖీ పౌర్ణమి పండగను పురస్కరించుకొని జోగిపేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం పద్మశాలీలు శివధనస్సును ఊరేగించారు. స్థానిక సంఘం ఆవరణలోని మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, పట్టణంలోని పురవీధుల గుండా జోగినాథ స్వామి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. అనంతరం జోగినాత ఆలయంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు పడిగే సత్యం, చేనేత సంఘ అధ్యక్షులు అశోక్, పద్మశాలి సంఘం నాయకులు శ్రీనివాస్, వెంకటేశం, వీరేశం, సత్యం, మధు, రమేష్, అనంత రాజ్, సుధీర్, రాజశేఖర్, రాజేందర్, బాలరాజ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల బిక్షాటన

నవతెలంగాణ-సంగారెడ్డి



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గత 16 రోజుల నుండి నిర్వహిస్తున్న సెకండ్ ఏఎన్ఎంల నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం సంగారెడ్డిలో బిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బోయిని ప్రసాద్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుండా షోకాస్ నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా ఏఎన్ఎంల సమస్యలు ను పరిష్కరించి సమ్మె విరమింప చేసే విధంగా కోరారు. ఈ కార్యక్రమంలో శ్యామల, లలిత, రాములమ్మ, కమల, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స కోసం సాయం



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలోని చెట్ల పోతారంకు చెందిన మంగళంపల్లి బాలకృష్ణ అనారోగ్యం పాలై ఇబ్బంది పడుతున్న క్రమంలో సదర్ కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సాయిని గడ్డపోతారం గ్రామపంచాయతీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి అందజేశారు. అలాగే హీటిరో పరిశ్రమ కాంట్రాక్టర్ సాయియిబాబా 5000 రూపాయల ఆర్థిక సాయం బాలకృష్ణ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి, సెక్రటరీ నరేష్ బాబు, శ్రీనివాస్, గ్రామపంచాయతీ పాలకవర్గ ప్రతినిధి బృందం తదితరులు పాల్గొన్నారు.

జూదమాడితే కఠిన చర్యలు

నవతెలంగాణ-న్యాల్‌కల్



మట్కా, జూదం ఆడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హద్నూర్ ఎస్సై రామనాయుడు అన్నారు. రాజోల గ్రామ శివారులో డప్పూర్ కిష్టా గౌడ్ మట్కా ఆడుతున్నట్టు నమ్మదగిన సమాచారంతో హద్నూర్ పోలీసులు తనిఖీ చేశారు. అతని వద్ద మట్కా బుక్కు, నాలుగు చిట్టీలు, రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై రామనాయుడు తెలిపారు.

ఓటమిభయంతోనే అక్రమకేసులు



నవతెలంగాణ-కంగ్టి: రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే వట్టే జానయ్యపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ నారాయణఖేడ్ అసంబ్లీ ఇంచార్జి పోలిస్ భీమన్న అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూర్యపేటలో జరిగే కార్యక్రమానికి వెళ్తున్న బీఎస్పీ కార్యకర్తలను పోలీసులు రాత్రికిరాత్రి అరెస్టు చేయడం సరికాదన్నారు. బీసీ బిడ్డ వట్టే జానయ్యపై మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అక్రమంగా కేసులు బనాయించి అరెస్టులు చేయిస్తున్నారని తెలిపారు. మంత్రిననే అహంకారంతోనే కక్షసాధింపు దిశగా తన అనుచరులను ఉసిగొల్పి అక్రమ కేసులు పెట్టిస్తూ జానయ్య యాదవ్‌ను జైలుకు పంపాలని కుట్ర పన్నుతున్నారన్నారు. కార్యక్రమంలో బీయస్పి మండల అధ్యక్షులు మైత్రిసాయిలు, నాయకులు వగ్గె రాజు ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ చంద్రశేఖర్ రాకతో
మారుతున్న రాజకీయ సమీకరణలు

- నిజయోకవర్గాన్ని చుట్టివస్తున్న ఎమ్మెల్యే మాణిక్యరావు
- మాణిక్యరావు విజ్ఞప్తిని బహిరంగంగానే తిరస్కరించిన ఢిల్లీ వసంత్
- తనకే బీఆర్ఎస్ టికెట్ వస్తుందంటున్న ఎర్రోళ్ల శ్రీనివాస్





నవతెలంగాణ-జహీరాబాద్





జహీరాబాద్ రిజర్వుడు నియోజకవర్గ కావడంతో రోజురోజుకు రాజకీయాల్లో పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రాజకీయంలో కురువృద్ధురాలు, మాజీ మంత్రి గీతారెడ్డి జహీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీకి ఆసక్తి చూపకపోవడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తానేనని మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ తన సొంత గ్రామమైన రాజినెల్లిలో ప్రకటించారు. నేటి వరకు స్తబ్ధంగా ఉన్న కాంగ్రెస్ నాయకుల్లో ఒక్కసారిగా ఊపందుకుంది. తన సొంత గ్రామంలో సభ ఏర్పాటు చేసి కోహీర్ మండల కేంద్రంలోని వివిధ ప్రార్థనా మందిరాలకు వెళ్లి సర్వమత ప్రార్థనలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జహీరాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తానే పోటీ చేస్తున్నానని ప్రకటించారు. మాజీ మంత్రి గీతారెడ్డికి రాజ్యసభ సీటు ఇప్పించేందుకు అధిష్టానంతో ఒప్పందం కూడా చేసుకున్నానని, ఆమె ఆశీస్సులు పూర్తిస్థాయిలో తనకే ఉన్నాయని ప్రకటించారు. దీంతో నియోజకవర్గంలో టికెట్ ఆశిస్తున్న ఆశావహులు తప్ప ముఖ్య నాయకులందరూ పెద్ద సంఖ్యలో హాజరవ్వడంతో చంద్రశేఖర్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక దళితులైన న్యాయవాది గోపాల్, ఝురాసంగం మాజీ జెడ్పీటీసీ నరేష్, మాజీ కౌన్సిలర్ సుజాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వారితో కూడా త్వరలో చర్చించి పార్టీ పగ్గాలను పూర్తిస్థాయిలో చంద్రశేఖర్ తమ అధీనంలోకి తీసుకుంటారని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు. వికారాబాద్ నుంచి 25 సంవత్సరాల వయసులోనే వికారాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది చరిత్ర సృష్టించారు చంద్రశేఖర్. అదే నియోజకవర్గంలో వివిధ పార్టీల అభ్యర్థిగా పోటీ చేసి ఐదుసార్లు గెలుపొందారు. రెండుసార్లు మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న చంద్రశేఖర్ సునాయాసంగా కాంగ్రెస్ పార్టీ నాయకులందర్నీ తన వైపు తిప్పుకుని న్యాయం చేస్తారని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రస్తుత శాసనసభ్యులు మాణిక్యరావును అధిష్టానం ప్రకటించిన నాటి నుంచి నియోజకవర్గంలోని గ్రామాల్లో తిరుగుతూ అందర్నీ సమన్వయపరిచేందుకు కృషి చేస్తున్నారు. టికెట్ ఆశించిన ఢిల్లీ వసంత్ ఎమ్మెల్యే మాణిక్యరావు విజ్ఞప్తిని బహిరంగంగానే తిరస్కరించారు. అన్ని పార్టీ నాయకులతో కలిసి తాను పోటీ చేస్తానని సభలు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. నిన్నటి వరకు స్తబ్దంగా ఉన్న ఎర్రోళ్ల శ్రీనివాస్, నరోత్తం తమకే అధికార పార్టీ బీఫామ్ వస్తుందని వారి అనుచరులు ప్రజల్లోకి వెళ్లి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యులతో సన్నిహితంగా ఉంటూ నియోజకవర్గం సమాచారాన్ని తెలియచేస్తూ తమకున్న బల ప్రదర్శనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. త్వరలోనే ట్రబుల్ షూటర్‌గా పేరు గాంచిన జిల్లా ఇంచార్జ్ మంత్రి హరీశ్‌రావు జహీరాబాద్ పర్యటిస్తారని, అప్పుడు అందరితో చర్చించి సమస్యలన్నింటినీ చక్కదిద్దుతారని ప్రచారం కొనసాగుతోంది. శాసనసభ్యులు మాణిక్యరావు ఇప్పటికే నియోజకవర్గంలో అసంతృప్తులందరినీ బుజ్జగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ ఇటీవలే ఝురాసంగం మండలంలోని కేతకి సంగమేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో జహీరాబాద్‌లో తమ పార్టీ అభ్యర్థి గెలుపొందుతారని, తమ తడాఖా చూపిస్తామని ప్రకటించారు. నియోజకవర్గంలోని అధికార పార్టీ కార్యకర్తలు, ఆయన అనుచరులు ఆనందంలో మునిగిపోతున్నారు. బీఫామ్ ఇచ్చేసరికి తనకే వస్తుందని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. గంటగంటకు జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ పార్టీలో రాజకీయ కోణాలు మారుతున్నాయి. బీఫాం వచ్చిన తరువాత ఎవరి దారి ఎక్కడో వేచి చూడాలి మరి.

నేటి మహాధర్నాను విజయవంతం చేద్దాం

- టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రభుత్వ విద్య ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నేటి ఇందిరాపార్కు వద్ద మహా ధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్ని దశల పోరాటాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకున్న పాపానపోలేదన్నారు. తత్ఫలితంగా విద్యా వ్యవస్థ, ఉద్యోగుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది అని అన్నారు. పదోన్నతులు లేవు, బదిలీలు లేవు, నియామకాలు లేవు, ఏ పాఠశాల పరిస్థితి చూసినా ఏమున్నది గర్వకారణం ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలతో కళకళలాడుతున్నాయి అని అన్నారు. సుమారు 22 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి అని అన్నారు.నూతన విద్యా చట్టాన్ని రద్దు చేయాలినీ, న్యాయ వివాదాలను పరిష్కరించి పండితుల, పీఈటీల పోస్టులను ఉన్నతీకరించాలని, అన్ని జిల్లాలకు డీఈఓ పోస్టులను, ప్రతి నియోజక వర్గానికి ఉప వైద్యాధికారి పోస్టులను, ప్రతి మండలానికి ఒక మండల విద్యాధికారి పోస్టులను మంజూరు చేయాలని, ముఖ్యమంత్రి ప్రకటించిన 5571 ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధించేందుకు నేటి ఇందిరాపార్కు వద్ద జరిగే ఉపాధ్యాయుల మహా ధర్నాకు వేలాదిగా ఉపాధ్యాయులు కదిలి రావాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ - గుమ్మడిదల



బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీఎం కేసీఆర్ దళితులకు మూడు ఎకరాల భూమి, నిరుద్యోగ భృతి, అర్హులైన విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా కల్లబొల్లి మాటలతో కాలయాపన చేస్తూ తమను మభ్యపెట్టి మరోసారి మోసం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పడానికి గుమ్మడిదల మండలం కానుకుంట సర్పంచ్ బేకు నీలమ్మ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని మాజీ సర్పంచ్ పోతరాజు రేణుకతో పటు గ్రామానికి చెందిన సుమారు 50 మంది మహిళలు ప్రకటించారు. గురువారం పటాన్చెరువు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రానున్నదని గ్రామాల్లో అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి, గ్రామ అధ్యక్షుడు అంజాద్, సుధాకర్, యాదయ్య కె రమేష్, ఎల్ రాజు, ప్రేమ్ కుమార్, టి రాజు, ఆశీర్వాదం, గ్రామస్థులు, కె ఎస్ జి యువసేన సభ్యులు పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ- కొండాపూర్



బీఎస్పీ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు ఎం.మైపాల్ అన్నారు. బీసీ నాయకుడు వట్టే జానయ్యయాదవ్‌పై పెట్టిన అక్రమ కేసులకు నిరసనగా బహుజన సమాజ్ పార్టీ ఇన్చార్జ్ ఆధ్వర్యంలో గురువారం చలో సూర్యాపేట కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీలు, ప్రెస్ మీట్ నిర్వహించే క్రమంలో ఉదయం మండలంలోని బీఎస్పీ నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ఎట్టి పరిస్థితులల్లో సూర్యాపేటలో బహుజన సమాజ్ పార్టీ రాజాధికారం సాధించి తీరుతామన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మండల వివిధ గ్రామాల బీఎస్పీ అధ్యక్షులు ఉన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వండి

- బొల్లారంలో కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం



అనుమానాస్పద వ్యక్తుల సమాచారం పోలీసులకు ఇవ్వాలని పటాన్ చెరు సబ్ డివిజనల్ ఆఫీసర్ పురుషోత్తమ రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు సబ్ డివిజనల్ ఆఫీసర్ పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో బొల్లారంలోని లక్ష్మీనగర్‌కాలనీలో ఉదయం 5 గంటల నుంచి ఏడు గంటల వరకు కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లాటరీ తగిలిందని, బహుమతులు వచ్చాయని, మేం ఇచ్చిన టాస్క్ పూర్తి చేయాలని మనల్ని మభ్య పెట్టి మీకు తెలియకుండా మీ అకౌంట్ నుంచి డబ్బులు మాయమవుతాయని తెలిపారు. వెంటనే 1930కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. బొల్లారం సీఐ నయీముద్దీన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు సరైన పత్రాలు చూపిస్తే వెంటనే వారికి ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు, ఎస్సై లు, ఏఎస్సై లు, హెడ్ కానిస్టేబుల్స్, మహిళా కానిస్టేబుల్స్ పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మంగంపేటలో చిరుత సంచారం?

- ఆవు మృతిపై అనుమానాలు

నవతెలంగాణ-జిన్నారం



జిన్నారం మండల పరిధిలోని మంగంపేట గ్రామంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు మంగంపేట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే స్థానిక రైతుకు చెందిన ఓ ఆవు చిరుత దాడిలో మరణించినట్లు అనుమానంగా ఉందంటూ బుధవారం అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. మృతి చెందిన ఆవు విలువ 50,000 పైసలకు ఉంటుందని మంగంపేట గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ నక్క నాగరాజు,నాయకులు నరేందర్ తదితరులు తెలిపారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో చిరుత సంచరించినట్లు వారు గుర్తు చేశారు. కాగా మంగంపేట గ్రామం అటవీ ప్రాంతానికి సమీపంలో నందనం ఫారెస్ట్ అధికారులు మరింత నిఘా చర్యలు పెంచాలని వారు కోరుతున్నారు.

బీజేపీ అధికార ప్రతినిధిగా రవీందర్‌రెడ్డి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధిగా రవీందర్‌రెడ్డికి నియామక పత్రాలను జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో అధికార ప్రతినిధిగా నియామకం చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. బిజెపి సిద్ధాంతాలను ఆదర్శాలను పునరుచితమై నీతి నిజాయితీ నిబద్ధత క్రమశిక్షణతో చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని తగిన సమయాన్ని జిల్లాలోని నాయకులకు కార్యకర్తలందరిని సమన్వయం చేస్తూ జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు చేస్తానని పార్టీని సంస్థగతంగా పటిష్టం చేస్తూ అన్ని వర్గాల మెప్పు పొందుతారని నా వంతు కృషి చేస్తానని మాట ఇస్తూ మరొకసారి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంగప్ప పాల్గొన్నారు.

నీలం మధుకు మద్దతుగా కిష్టారెడ్డిపేటలో రాస్తారోకో

- పటాన్‌చెరు టికెట్‌పై కేసీఆర్ పునరాలోచించాలని డిమాండ్

నవతెలంగాణ-అమీన్‌పూర్



బీసీ నేత, రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్‌కు మద్దతుగా సబ్బండవర్గాలు ఏకమవుతున్నాయి. గురువారం అమీన్‌పూర్ మండలంలోని కిష్టారెడ్డి పేట గ్రామంలో నీలం మధుకు మద్దతుగా రాస్తారోకో నిర్వహించారు. పటాన్ చెరు నియోజకవర్గంలో నీలం మదుకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటూ వివిధ కుల సంఘాలు, యువత గొంతెత్తుతున్నారు. వారం రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నీలం మధుకు మద్దతుగా నిరసన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. బీసీ వర్గానికి చెందిన బహుజన నాయకుడు నీలం మధుకు కేసీఆర్ టికెట్ కేటాయించాలనే డిమాండ్లు రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తున్నాయి. 65 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గాన్ని కేసీఆర్ విస్మరించడం పట్ల ఆ వర్గం ప్రజలతో పాటు మిగిలిన బీసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 65 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం టికెట్లు కేటాయించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ పటాన్ చెరు టికెట్ పై పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని ముక్త కంఠంతో సబ్బండ వర్గాల ప్రజలు కోరుతున్నారు. రక్షాబంధన్ పండుగ నాడు సైతం నీలం మధు మద్దతుదారులు ఆందోళనలు నిర్వహించారు. తన అభిమాన నేతకు టికెట్ వచ్చినరోజే తమకు పండుగ వాతావరణమని పేర్కొన్నారు. నీలం మధుకు టికెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ కిష్టారెడ్డి పేటలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గమే కాకుండా జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అనుక్షణం ప్రజలతో మమేకమై ఉంటున్న నీలం మధు ముదిరాజ్ కి టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా అనునిత్యం బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి అవిశ్రాంతంగా కృషిచేసిన నీలం మధు కు ముఖ్యమంత్రి కేసీఆర్ టికెట్ నిరాకరించడం సరికాదన్నారు. పటాన్ చెరు నియోజకవర్గ టికెట్ పై ఇకనైనా కేసీఆర్ పునరలోచించుకుని, సబ్బండ వర్గాలందరికి ఆమోదయోగ్యుడైన నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించాలని కోరారు. 65 లక్షల జనాభా గలిగిన ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రత్యక్ష ఎన్నికల్లో అవకాశం కల్పించడం ద్వారానే సరైన ప్రాతినిధ్యం దొరుకుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. నీలం మధుకు టికెట్ కేటాయిస్తే ఇంటికొకరం ఇన్చార్జిగా పనిచేసే గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ మహేష్, బొమ్మను కుంట వార్డు సభ్యులు రాజు, మన్నే రాములు,ప్రభాకర్,మహేష్,యాదగిరి, బాల్ రాజ్, బిక్షపతి, కుమార్,శ్రీధర్,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్

- మంత్రికి రాఖీ కట్టిన కార్పొరేటర్

నవతెలంగాణ-రామచంద్రాపురం







సోదర భావానికి ప్రత్యేక అయిన రాఖీ పండుగను రామచంద్రాపురం, భారతి నగర్, తెల్లాపూర్ మున్సిపాలిటీ లోని గ్రామాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు నివాసానికి రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్, భారతి నగర్ కార్పొరేటర్ హిందూ ఆదర్శ రెడ్డి ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా ఉదయాన్నే వెళ్లి మంత్రికి రాఖీ కట్టారు. ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి నివాసాలకు కార్పొరేటర్ పుష్ప, బీఆర్ఎస్ మహిళా నాయకులు వెళ్లి రాఖీ కట్టారు. భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి తన సోదరుడు సమరసింహారెడ్డికి రాఖీ కట్టారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సాయి నగర్ కాలనీలో గల సాయిబాబా ఆలయంలో రాఖీ పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తడుక నాగభూషణం ఆధ్వర్యంలో కుల బాంధవులు గాయత్రీ, జంజీర ధారణ, రాఖీ పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు నర్సింలు, రాజు, వాసుదేవ్, వీరేశం, వెంకటేష్, సంగమేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రజలు సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ప్రతి ఇంట అన్నాచెల్లెళ్ల సందడితో రాఖీ పౌర్ణమి వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు. జిన్నారం మండల ప్రజలకు సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, ఎంపీపీ రవీంద్ర గౌడ్, ఉపాధ్యక్షులు గంగు రమేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత వెంకటేశం గౌడ్,బిజెపి సంగారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ, సర్పంచులు అంకిరెడ్డి గారి లావణ్య శ్రీనివాస్ రెడ్డి, ప్రకాశం చారి, సరిత సురేందర్ గౌడ్, సుశాంతి నవనీత రెడ్డి,చిట్ల సత్యనారాయణ, సోలక్ పల్లి, శ్రీకాంత్ రెడ్డి,ఖదీర్, జనార్ధన్ ఆంజనేయులు, శెట్టి శివరాజ్, ప్రశాంతి నరేందర్, జింక రమ, రేఖా కృష్ణ, వెంకటయ్య, లావణ్య జీవన్, ఎంపీటీసీలు బోరెడ జనాభాయ్ ,స్వాతి ప్రభాకర్ రెడ్డి, ఆకుల భార్గవ్, కోర బోయిన లావణ్య నరేష్, జిన్నారం వెంకటేశం గౌడ్, బత్తుల సంతోషి మహేష్, రాఖీ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

గురుకులంలో..

మండల కేంద్రమైన జిన్నారంలో గల గిరిజన గురుకుల బాలుర పాఠశాల కళాశాలల ప్రాంగణంలో రాఖి వేడుకలను గురువారం విద్యార్థులు ఉపాధ్యాయ బృందం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సాంబయ్య నాయక్, గాయత్రి, శ్రీనివాస్ విద్యార్థుల బృందం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల పరిధిలోని అన్ని గ్రామాలలో గురువారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. అక్కా చెలెళ్లు అన్నాదమ్ములకు రాఖీలు కట్టారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కు జడ్పీటీసీ స్వప్నభాస్కర్ హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.













నవతెలంగాణ-జోగిపేట

రాఖీ పండగ పురస్కరించుకొని గురువారం ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తన అక్కాచెల్లెళ్లతో రాఖీ కట్టించుకున్నారు. అనంతరం వారి ఆశీర్వాదం తీసుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరికీ రాఖీ పండగ శుభాకాంక్షలు ఆయన తెలియజేశారు.

నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం



బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో రక్షాబంధన్ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మున్సిపల్ కౌన్సిలర్ చంద్రా రెడ్డికి పలువురు చిన్నారులు చిట్టి చేతులతో రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు చంద్రారెడ్డి ఆశీస్సులు అందించారు. మున్సిపల్ లోని సోదర సోదరీమణులకు కౌన్సిలర్ చంద్ర రెడ్డి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-పటాన్ చెరు

పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలు ఎమ్మెల్యే కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ డివిజన్ మహిళలతో కలిసి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ

3

మెదక్

శుక్రవారం | సెప్టెంబరు 01 2023 | www.navatelangana.com

అన్ని పార్టీలు బీసీలకు 40 సీట్లు ఇవ్వాలి



జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి యాదవ్

నవతెలంగాణ-నార్సింగి : ఎస్సీ ఎస్టీ లకు డిక్లరేషన్‌లు, వారి వాటా సీట్లు ఇచ్చారని, బీసీ లకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు ఈరప్ప యాదగిరి యాదవ్ ప్రశ్నించారు. మండల కేంద్రం లో జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకుడు దిడ్డి శ్రీనివాస్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా బీసీలకు అధికారానికి దూరంగా ఉంచి అధికారాన్ని అనుభవించారన్నారు. బడ్జెట్‌లో రావాల్సిన వాటాను దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలు పార్టీల నాయకులు బీసీ లకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారన్నారు. దళితులకు దళిత బందులు ఇచ్చారని, బీసీలకు ఉత్తి వాగ్దానాలు చేసి మాటలతో సంతోష పెట్టారన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు పక్కన పెట్టాలన్నారు. రాష్ట్ర జనాభాలో 64శాతం ఉన్న బీసీ లకు న్యాయం చేస్తూ, మాటలు పక్కన పెట్టి పనులు చేపట్టాలన్నారు. వెంటనే బీసీ బంధు నిధులు విడుదల చేయాలని, జనాభా ప్రాతిపదికన అధిక మొత్తంలో ఉన్న బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలలో కనీసం 40సీట్లు కేటాయించాలని ఈ సందర్భంగా యాదగిరి డిమాండు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నవతెలంగాణ-హవెలిఘనపూర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడగ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మెదక్ పట్టణ పరిధి ఔరంగాబాద్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు గ్రామానికి చెందిన మస్కురి ప్రవీణ్ (34) గతంలో హవేలిఘనపూర్‌లో వీఆర్ఎగా విధులు నిర్వహించాడు. ఇటీవల ప్రభుత్వం వీఆర్ఏలను పర్మినెంట్ చేయగా సిద్దిపేట తహసిల్దార్ కార్యాలయంలో ప్రవీణ్ చైన్ మైన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆర్థిక ఇబ్బందులతో భార్య శకుంతలతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన ప్రవీణ్ ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగాడు. మెదక్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం అతన్ని హైదరాబాద్‌లో ఆసుపత్రికి తరలించగా గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని హవేలిఘనపూర్ ఏఎస్ఐ సమియోద్దీన్ తెలిపారు.

కుష్టు వ్యాధి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

- జిల్లాలో 11 మందికి వ్యాధి నిర్ధారణ
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చందు నాయక్

నవతెలంగాణ-మెదక్

కుష్టు వ్యాధి రహిత జిల్లాగా మార్చడానికి ఆరోగ్య శాఖ కృషి చేస్తుందని, ప్రజలు భాగస్వాములై సహకరించాలని ప్రజలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చందు నాయక్ పేర్కొన్నారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16 నుంచి 31వరకు జిల్లాలో కొనసాగిన కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు ఉద్యమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 14 రోజుల వ్యవధిలో 1,69,397 ఇళ్లను సందర్శించి, 6,90,352 మందిని పరీక్షించడం జరిగిందని, అందులో 357 మంది అనుమానితులను గుర్తించగా 11 మందిని వ్యాధిగ్రస్తులుగా జిల్లా పార మెడికల్ అధికారి శంకర్ రాథోడ్, డిప్యూటీ పార మెడికల్ అధికారులు జాఫర్, లక్ష్మణ్‌లు గుర్తించి చికిత్స ప్రారంభించడం జరిగిందన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఇంట్లో ఉన్న ప్రతి వ్యక్తిని పరీక్షించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఆరోగ్య సిబ్బంది ఆశ కార్యకర్తలు సర్వే చేయగా



ప్రజల్లో కుష్టు వ్యాధి పట్ల మంచి అవగాహన ఏర్పడిందన్నారు. ఇంకా కుష్టు వ్యాధికి సంబంధించిన లక్షణాలు కలిగిన వ్యక్తులు ఎవరైనా ఉంటే దగ్గరలోని ప్రభుత్వ దవాఖానలో వైద్యాధికారిచే పరీక్ష చేయించుకొని తగిన చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు. లేనిపక్షంలో భవిష్యత్తులో అంగవైకల్యం ఏర్పడే అవకాశం ఉంటుందని, కుష్టు వ్యాధి అనేది మైకో బాక్టీరియమ్ లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల కలిగే వ్యాధి అని, ఈ బ్యాక్టీరియా సోకిన వారికి ప్రాథమిక దశలో శరీరం మీద తెల్లటి, రాగి లేదా గోధుమ రంగు కలిగిన మచ్చలు ఏర్పడుతాయన్నారు. మచ్చ ఉన్న చోట స్పర్శ కోల్పోయి మొద్దుగా ఉంటుందని కొన్ని సందర్భాల్లో చేతి లేదా కాలి వేళ్ళు వంకరగా ఉన్నా, తెలియకుండా గాయాలు అయిన, బరువు ఎత్తలేక పోయిన, నడుస్తున్నప్పుడు చెప్పులు జారుతున్నా, వేడి పాత్రలు ముట్టుకున్నప్పుడు తెలియక పోయినా వ్యాధి లక్షణాలుగా అనుమానించాలని తెలిపారు. కుష్టు వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ వైద్యులను సంప్రదించి వ్యాధి నిర్ధారణ చేయించుకొని మల్టీడ్రగ్ తెరఫీ మందులు వాడటం ద్వారా వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం ముగిసిందని, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు బాగా పని చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమం ముగిసినా క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉంటారని వివరించారు.

రూ. 2.5 లక్షల ఎల్‌ఓసి అందజేత



నవతెలంగాణ-మెదక్

అనారోగ్యంతో ఆసుత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబానికి రూ. 2.5 లక్షల ఎల్‌ఓసిని గురువారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇఫ్కో డైరెక్టర్ యం.దేవేందర్ రెడ్డి అందజేశారు. మెదక్ మండల పరిధిలోని రాజ్ పల్లి గ్రామానికి చెందిన అరుణ్ తండ్రి దుర్గేష్ అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై మెదక్ ఎమ్మెల్యే యం.పద్మదేవేందర్ రెడ్డి దృష్టికి స్థానిక నాయకులు తీసుకవెళ్లగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2,50,000 ఎల్‌ఓసిని నిమ్స్ హాస్పిటల్‌కు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మెదక్ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, మెదక్ మండల రైతుబంధు అధ్యక్షులు కిష్టయ్య, నాయకులు ఎలక్షన్ రెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

త్వరలో పద్మశాలి సంఘాన్ని నిర్మించుకుంటాం



నవతెలంగాణ-చేగుంట

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో త్వరలో పద్మశాలి సంఘాన్ని నిర్మించుకుంటామని పద్మశాలి సంఘం అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి చాట్ల సంతోష్ పేర్కొన్నారు. చేగుంట పట్టణ కేంద్రం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా సంఘం నాయకులు జంధ్యం ధరించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల చేగుంట పట్టణ కేంద్రంలో మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి పర్యటించారని, పద్మశాలి సంఘం నాయకులను ఎంపీని కలిసి పద్మశాలి కమిటీ హాల్ మంజూరు చేయాలని వినతి పత్రాన్ని కూడా అందజేశామన్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పద్మశాలి సంఘం నాయకులు అందరం కలిసి పద్మశాలి సంఘ భవనం నిర్మించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నాగులు, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

రెండో విడత దళిత బంధు విడుదల చేయాలి



నవతెలంగాణ-నార్సింగి

మైనారిటీలకు రెండో విడత, నార్సింగికి దళిత బంధు విడుదల చేయాలని నార్సింగి పట్టణ బీ.ఆర్.ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భూపతి రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మైనారిటీలు తొలి విడతలో కొంత మంది మిగిలిపోయారని, మలి విడత కోసం చాలా మంది ఎదురుచూస్తున్నారన్నారు. తక్షణమే రెండో విడత మైనారిటీలకు ఆర్థిక సహాయం విడుదల చేయాలని అన్నారు. మండలంలోని సంభాపూర్ గ్రామానికి దళిత బంధు విడుదల చేశారని, నార్సింగికి విడుదల చేయలేదని, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి దళితులకు దళిత బంధు, మైనారిటీలకు ఆర్థిక సహాయం అందజేయాలని ఆయన కోరారు.

మృతుని కుటుంబానికి జెడ్పీటీసీ ఆర్థిక సహాయం



నవ తెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన నీలం చంద్రయ్య ఇటీవల మృతి చెందారు. అతని కుటుంబానికి నిజాంపేట మండల జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ రూ.5000ల ఆర్థిక సహాయం అతని అనుచరుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీలం సంజీవ్, శింబె శ్రీనివాస్, గోపర్ స్వామి, బోయిని రమేష్, స్వామి, నీలం తిరుపతి, ధర్మారెడ్డి, పట్నం రమేష్, నీలం స్వామి, రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఘాతంతో దూడ మృతి



నవతెలంగాణ-చిలిపిచేడ్

విద్యుత్ ఘాతంతో దూడ మృతి చెందిన సంఘటన గన్య తాండలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గన్య తండాకు చెందిన రూప్ సింగ్ దూడ ఇంటి నుంచి పక్కన మేత మేసుకుంటూ వెళ్ళగా పక్కన ఉన్న 3ఫేస్ కరెంట్ తీగలు తగిలి మృతి చెందింది. దూడ మృతి చెందడంతో రూప్సింగ్ కన్నీరు పెట్టుకొని బోరున విలపించాడు. ప్రభుత్వం ఆదుకోవాలని సుమారు రూ.30 వేల నష్టం జరిగిందని తెలిపారు.

బీజేపీ దుబ్బాక మండల అధ్యక్షునిగా అంబటి

నియామక పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

దుబ్బాక మండలం గోసాన్ పల్లి గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకుడు అంబటి శివ ప్రసాద్ గౌడ్ భారతీయ జనతా పార్టీ దుబ్బాక మండల అధ్యక్షునిగా నియామకమ య్యారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రఘునందన్ రావు వారికి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అంబటి శివప్రసాద్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో అతి చిన్న వయసులో అతిపెద్ద బాధ్యత అప్పజెప్పిన ఎమ్మెల్యే రఘునందన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం ఎల్లప్పుడూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్









సోదరులకు రాఖీ కట్టిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

నవతెలంగాణ-మెదక్

అన్నా చెల్లెళ్ళ, అక్కా తమ్ముళ్ళ అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్ అని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి హైదరాబాద్‌లోని తమ నివాసంలో సోదరులు వంశీధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డిలకు రాఖీ కట్టారు. ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డికి చెల్లెల్లు దయాశీల, రజిత రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్కాతమ్ముళ్ల, అన్నాచెల్లెళ్ల అనుబందానికి ప్రతీక రక్షా బందన్ అని పేర్కొన్నారు. ఈ మంచి అనుబంధాన్ని ఆప్యాయతను పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఈ పండుగను అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. అనురాగానికి సంకేతమైన ఈ పండుగను కుటుంబ సభ్యులందరూ కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నవతెలంగాణ-నార్సింగి : మండలానికి చెందిన బీ.ఆర్.ఎస్ నాయకులు గురువారం రాఖీ పండుగను తోబుట్టువులతో ఘనంగా నిర్వహించారు. ఎంపిపి సబిత రవీందర్ తన సోదరునికి రాఖీ కట్టగా, మండల పార్టీ అధ్యక్షుడు మైలారం బాబుకు సొదరీలు, మాజీ వైస్ ఎంపిపి ఆకుల మల్లేష్ గౌడ్ అతని సోదరునికి తోబుట్టువులు రాఖీలను కట్టారు. ఈ సందర్భంగా వారు రాఖీ పండగ విశిష్ఠత గురించి వివరిస్తూ హిందూ పంచాంగం ప్రకారం ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి నాడు అక్కా చెల్లెళ్ళు అన్నా తమ్ముళ్లకు రాఖీలను కట్టి రక్షా బంధన్ నిర్వహించుకుంటారన్నారు. రక్షా అంటే రక్షించడం బంధన్ అంటే సూత్రం అని, అంటే అక్కలు చెల్లెళ్ళు అన్నా తమ్ముళ్లకు రక్షణ సూత్రం కట్టడం పరమార్థమని వివరించారు. పండుగ సందర్భంగా ఆడపిల్లలు తమ అన్నదమ్ములు ప్రతి పనిలో విజయాన్ని పొందాలని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరు కుంటూ ఎర్రని దారాన్ని కట్టి తీపి పదార్థాలు తినిపించి, నుదుటన వీర తిలకం పెట్టి హారతి ఇచ్చి క్షేమాన్ని కొరుతారన్నారు. ఆడపడుచులకు సోదరులు ఈ సందర్భంగా వారికి నచ్చిన బహుమతులను అందిస్తారని, ఈ సంప్రదాయం వల్ల ఆడబిడ్డకు పుట్టినింటికి ఉన్న బంధాన్ని మరింత బలం చేకూరుస్తుందన్నారు.

నవతెలంగాణ-కొల్చారం : అన్నాచెల్లెళ్ల అనురాగ బంధానికి అపురూప వేడుక రక్షాబంధన్. హిందూ సంప్రదాయ పండుగల్లో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నది రాఖీ పౌర్ణమి. రక్ష అనగా సంరక్షణ అని అర్థం. గురువారం రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆడపడుచులు పుట్టింటికి చేరుకుని తమ సోదరులకు ప్రేమతో, కలకాలం సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తూ రాఖీలు కట్టి దీవించారు. దీనికి ప్రతిగా సోదరులు నూతన వస్త్రాలు, బహుమతులను కానుకగా అందజేశారు.

సొమ్మసిల్లిన సెకండ్ ఏఎన్ఎం





నవతెలంగాణ - మెదక్

తమ హక్కుల సాధన కోసం సెకండ్ ఏఎన్ఎంలు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం మెదక్ కలెక్టరేట్ వద్ద కొనసాగింది. రాఖీ పండుగ సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్ర పటానికి రాఖీ కట్టారు. ఈ క్రమంలో ఓ సెకండ్ ఏఎన్ఎం సొమ్మసిల్లి పడిపోయింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పదిహేను ఏళ్లుగా ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 2018 జూలై 26న నోటిఫికేషన్ విడుదల చేసిందని, 30 మార్కుల వెయిటేజ్ ఇచ్చి 20 మార్కులకు కుదించడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎం ల జిల్లా నాయకులు సంగీత, తన్వీర్, సునీత, విజయ, దుర్గ, యాదమ్మ, నిర్మల, తులసి, సాయమ్మ, నవనీత, హేమలత, రమ్య, విజయలక్ష్మి తదితరులున్నారు.

రైతుల పంట పొలాలకు కాళేశ్వరం నీళ్లు

కృషి చేసిన ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ నాయకుల కృతజ్ఞతలు



నవతెలంగాణ-నిజాంపేట

రైతుల పంట పొలాలకు కాళేశ్వరం నీళ్ల అందించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం మండల ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ద్వారా సీఎం కేసీఆర్ దృష్టికి రైతులు తీసుకెళ్లారని తెలిపారు. తక్షణమే స్పందించి కాళేశ్వరం నీళ్లను అందించాలని అధికారులకు సూచించడంతో మండలంలోని తిప్పనగుల్ల, బచ్చురాజు పల్లి, సాయ చెరువు, జెడ్చెరు తాండ, గ్రామాలలో చెరువులు నింపడానికి నీరు విడుదల చేశారన్నారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మండల అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం కల్పిస్తున్నారన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి వేసిన పంటలు నష్టపోకుండా రైతుల పంట పొలాలకు నీళ్లను అందించేలా కృషి చేసిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి రైతుల పక్షపాతి అని కొనియాడారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యేకు పూర్తి మద్దతుగా నిలిచి లక్ష మెజార్టీతో గెలిపించుకొని మంత్రి పదవిలో చూస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. మండల ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బాపురెడ్డి, పట్టణ అధ్యక్షులు నాగరాజు, మాజీ కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్,యూత్ అధ్యక్షులు మౌవురం రాజు, సంగుస్వామి, ఎల్ రాములు గౌడ్, నాయిని లక్ష్మణ్, మహేష్, మాజీ ఎంపిటిసి వెంకటస్వామి, తాడెంమల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనం నిర్మించాలి

- పది సంవత్సరాల నుంచి మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదు
- మహారాష్ట్ర మార్కండేయ గుడికి రూ.కోటి విరాళం
- నిజాంపేట అంబేద్కర్ భవనానికి నిధులేవి?



నవతెలంగాణ నిజాంపేట

మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం నిర్మించాలని దాదాపు పది సంవత్సరాల నుంచి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి విన్నవించుకున్నా నేటి వరకూ స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలో మాల కులస్తులు దాదాపుగా 600 కుటుంబాల వరకు నివసిస్తున్నారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కల్లూరు సంజీవ్, మాల మహానాడు రాష్ట్ర కోకన్వీనర్ ర్యాకం శ్రీరాములు ఆధ్వర్యంలో నిజాంపేట మాల కులస్తులు అందరమూ వెళ్లి దాదాపు రెండు సంవత్సరాల క్రితం ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో ఏదైనా సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్న శుభకార్యాలు నిర్వహించుకోవాలన్నా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహారాష్ట్రలోని సోలాపూర్‌లో మార్కండేయ టెంపుల్ నిర్మాణానికి రూ.కోటి విరాళం ప్రకటించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు నిజాంపేట అంబేద్కర్ భవనం గుర్తుకు రాలేదా? స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అంబేద్కర్ భవనం మంజూరు చేయాలి

మండల కేంద్రంలో మాల కులస్తులకు అంబేద్కర్ భవనం లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నాం. అంబేద్కర్ భవనం నిర్మించాలని ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డికి మొర పెట్టుకున్నాం. వెంటనే ఆమె స్పందించి భవనం నిర్మించడానికి హామీ ఇచ్చినా నేటి వరకూ అమలు కావడం లేదు. ఇప్పటికైనా మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి స్పందించి అంబేద్కర్ భవనం నిర్మించడానికి తగిన చర్యలు తీసుకోవాలని మనవి.



- కల్లూరి సంజీవ్,
మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు

ప్రొసీడింగ్ ఇవ్వాలి



మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం నిర్మించాలని కోరుతూ ఏప్రిల్ 16న రిలే నిరాహార దీక్షలు చేసినా ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి స్పందించలేదు. మాల కులస్తులకు అంబేద్కర్ భవనం ఎందుకు నిర్మించడంలేదో అర్థం కావడంలేదు. ఇప్పటికైననా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వెంటనే స్పందించి మాల కులస్తులకు అంబేద్కర్ భవనం నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి.

- టంకరి లక్ష్మణ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
శుక్రవారం | సెప్టెంబరు 01 2023 | www.navatelangana.com

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇంద్రసేనారెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

పీఆర్‌టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అత్యవసర సమావేశంలో పంతం వెంకటరాజం ద్వారా ఖాళీ అయినా జిల్లా ప్రధాన కార్యదర్శి పోస్టును మల్లు గారి ఇంద్రసేనారెడ్డికి అప్పగించామని శాసనమండలి సభ్యులు కూర రఘోత్తంరెడ్డి తెలిపారు. జనగామ జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు కొల్లు మహిపాల్ రెడ్డి, నూకల ఎల్లారెడ్డి ఎన్నికల అధికారులుగా ఇంద్రసేనారెడ్డిచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ, పంతం వెంకటరాజం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లక్కిరెడ్డి విజయ, ఆస లక్ష్మణ్, రవీంద్ర కుమార్, ముత్యాల సురేందర్ రెడ్డి, హనుమారెడ్డి , మల్లారెడ్డి, అనిల్ కుమార్ , వేమారెడ్డి, పల్లె శ్రీనివాస్ గౌడ్, ఎస్ రామకృష్ణారెడ్డి, బొల్లం రాజశేఖర్, రామచంద్రారెడ్డి, కూరెళ్ళ శ్రీనివాస్ రెడ్డి, సతీష్ కుమార్, కత్తుల బాపు రెడ్డి, బెంజరం నరసింహారెడ్డి, రాజు రెడ్డి, త్యాగరాజు, బొల్లం శ్రీనివాస్, నరసింహారెడ్డి, వంగ శ్రీనివాస్ రెడ్డి, పవన్ కుమార్, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో 16 వార్డు చెందిన మిట్టపల్లి రాజుకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60 వేల చెక్కును గురువారం అందజేశారు. నిధులు రావడానికి సహకారం చేసిన తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్ మిట్టపల్లి రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినం పాటించాలి

- జాక్టో చైర్మన్ పట్నం భూపాల్



నవతెలంగాణ-సిద్దిపేట

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ జాక్టో ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినం పాటించాలని జాక్టో చైర్మన్ పట్నం భూపాల్, వైస్ చైర్మన్ సుద్దాల భిక్షపతి, హేమ చందర్‌లు ఉపాధ్యాయులను కోరారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం సిద్దిపేట జాక్టో ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో విద్రోహ దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ పొందడం ప్రభుత్వ ఉద్యోగ రాజ్యాంగ హక్కని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 1న పాఠశాల స్థాయిలో నల్ల బ్యాడ్జీల తో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాల స్థాయిలో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, సాయంత్రం జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందిస్తామన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పిఆర్సి కమిటీవేసి ఐ ఆర్ ప్రకటించాలని, కోర్టు స్టే ఎత్తివేసి, బదిలీలు ప్రమోషన్లు చేపట్టుటకు అనుమతి ఇచ్చి నందున ప్రభుత్వము సత్వరమే షెడ్యూల్ విడుదల చేసి బదిలీలు ప్రమోషన్లు చేపట్టాలని అన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి జాక్టో ఉద్యమం చేపడుతుందన్నారు. ఈ సమావేశంలో జాక్టో ప్రతినిధులు కాల్వ సురేష్, రంగారావు, కేమ్మ సారం రవీందర్, శ్రీధర్, బండి నర్సింలు, ఖాత యాదగిరి, పెరికా నరేష్ కుమార్, గణేష్, విష్ణురాం, సంపత్ కుమార్, యాటిల్లి ఈశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జేపీ తండాలో తీజ్ వేడుకలు



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం జేపీ తండ గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్, మేరమ్మ యాడి ఆశీస్సులతో గురువారం సాయంత్రం గిరిజనుల పండుగ తీజ్ పండుగ చివరి 9వ రోజు తీజ్ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బంజారా ఆటపాటలు నృత్యాలతో డ్యాన్సులతో ఆడుతూ పాడుతూ ఊరేగింపుగా లచ్చ లయచెరువులో తీజ్ నిమజ్జనం బుట్టలు వేయడం జరిగింది. బతుకమ్మ తరహాలో తొమ్మిది రోజులు పూజించి చివరి రోజు చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్యలు హాజరయ్యారు. తీజ్ ప్రత్యేకత తొమ్మిది రోజులు పెళ్లి కానీ అమ్మాయిలు రోజు3 సార్లు బుట్టలు పైన నీళ్లు పోస్తారు. బుట్టలో గోధుమయరు మట్టి శనగలు మేక ఎరువు కలిపి బుట్టలో వేసి పందిరిలో పైన పెడతారు. రోజుకు మూడు సార్లు పెళ్ళికాని అమ్మాయిలు పూజ చేస్తూ నీళ్లు పోస్తారు. తొమ్మిదో రోజు ప్రత్యేక పూజలు చేసి చెరువులో నిమజ్జనం చేశారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో తీజ్ పండుగ జరుపుకోవడం గిరిజన బంజారా సాంప్రదాయ పండుగ. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భిక్షపతి, వార్డ్ మెంబర్లు,ప్రజా ప్రతినిధులు, బంజారా కుల పెద్ద మనుషులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

గొల్ల కుర్మలకు గొర్రెలను అందించిన ఎఫ్డిసి చైర్మన్



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన గొల్ల కురుమలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అందజేస్తున్న గొర్రెల యూనిట్లను గురువారం ఎఫ్‌డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అందించారు. గ్రామానికి చెందిన గోల్లకుర్మలకు చెందిన 19 కుటుంబాలకు ప్రభుత్వం తరపున సబ్సిడీ గొర్రెలను అందించినట్లు తెలిపారు.ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని కేసీఆర్ కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ ఇంద్రసేనారెడ్డి వట్టిపల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు విజయ్ కుమార్, బి ఆర్ ఎస్ పార్టీ మండల కార్యదర్శి యశ్వంత్ రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు మోహన్ రెడ్డి, యాదవ సంఘం అధ్యక్షులు కనకయ్య, ఎస్సి సెల్ మండల ప్రధాన కార్యదర్శి రాములు, వికలాంగుల అధ్యక్షులు దేవదానం, రాములు, నాయకులు కనకయ్య,కిషన్ శ్రీరాముల కనకయ్య కలిల్, శివారెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, భూపతి రెడ్డి, కరుణాకర్, ఎల్లయ్య చంద్రయ్య , ఐలయ్య, పోచయ్య డాక్టర్ గోపాలమిత్ర సర్వర్ ఖాన్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ స్వామి రథోత్సవం



నవతెలంగాణ-దుబ్బాక

రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని గురువారం దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో గల "శ్రీ భక్త మార్కండేయ దేవాలయం"లో విశేష పూజలు,అర్చనలు, అభిషేకాలు,యజ్ఞోపవీత ధారణ వంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించినట్లు పద్మశాలి సమాజం అధ్యక్షుడు బడుగు రాజు తెలిపారు.సాయంత్రం మార్కండేయ స్వామి వారి రథోత్సవాన్ని లచ్చపేట పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో ఊరేగింపు చేయడం జరిగిందన్నారు. పద్మశాలి సమాజం సభ్యులు భజనలు, కోలల ఆటలతో అంగారంగ వైభవంగా రథోత్సవాన్ని ముందుకు నడిపించారు. 10, 11 వార్డుల కౌన్సిలర్లు కూరపాటి బంగారయ్య, నందాల శ్రీజ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు మచ్చ గణేష్, కార్యదర్శి కూరపాటి మురళి, సహాయ కార్యదర్శి కూరపాటి వెంకటేష్,కోశాధికారి చెలిమెల్ల రాజేశం, పద్మశాలి క్యాబినెట్ సభ్యులు,సమాజం సభ్యులు, పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



నవతెలంగాణ-మర్కుక్

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పాములపర్తి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మర్కుక్ ఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం మండలంలో ఇప్పల గూడెం గ్రామానికి చెందిన నర్సారెడ్డి(64) పాములపర్తి గ్రామానికి చెందిన మనోహర్ రెడ్డి నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లో శవమై కనిపించాడు. గురువారం ఉదయం నూతనంగా నిర్మిస్తున్న ఇల్లు గోడలకు కూలీలు నీళ్ళు పట్టానికి వెళ్ళెసరికి శవమై కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి మర్కు క్ ఎస్ఐ శంకర్ శవాన్ని పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతికి గల కారణాలను పలు కోణాలలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

మండలంలో ఇప్పల గూడెం గ్రామానికి చెందిన నర్సారెడ్డి(64) పాములపర్తి గ్రామానికి చెందిన మనోహర్ రెడ్డి నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంపీపీ తాండ పాండుగౌడ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, ఇప్పల గూడెం సర్పంచ్ చాడ ప్రసన్న సుధాకర్ రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్

















నవతెలంగాణ-సిద్దిపేట

రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా హైదరాబాద్‌లోని మంత్రి హరీశ్ రావు నివాసంలో వేడుకలు ఘనంగా జరిగాయి. సిద్దిపేటకు చెందిన మహిళ నాయకురాలు, అక్కచెల్లెళ్ళకు మంత్రికి రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ మహిళలకు తోడుగా ఉంటుందని, వారి భద్రత, రక్షణ, సంక్షేమం బీఆర్ఎస్ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని మంత్రి తెలిపారు.

నవతెలంగాణ-మర్కుక్

అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. తమ పేగు బంధం కలకాలం నిలువాలని కోరుకుంటూ సోదరుడికి సోదరి కట్టే కంకణమే రక్షా బంధన్. గురువారం రాఖీ పౌర్ణమిని ప్రజలు ఘనంగా నిర్వహించారు. బంధువులు, కుటుంబ సభ్యులతో ఇంటింటా సందడిగా గడిపారు. బుధవారం నుంచే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులతో రోడ్లు, బస్టాండ్లు రద్దీగా మారాయి. రాఖీలు, స్వీట్లు కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా మండల ప్రజలకు మర్కుక్ ఎంపీపీ తాండ పాండుగౌడ్, జెడ్పిటిసి యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సింగం సత్తయ్య, బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మేకల కనకయ్య ముదిరాజ్, ఎంపీటీసిల ఫోరం మండలాధ్యక్షులు రాజబోయిన కృష్ణ యాదవ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు అప్పాల ప్రవీణ్ కుమార్ లు రాఖీ వేడుక పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీతో అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధం మరింత బలోపేతం కావాలని, ప్రజల మధ్య సోదరభావం పెంపొందాలని వారు ఆకాంక్షించారు. మండలంలోని అన్ని గ్రామాలలో రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నవతెలంగాణ - సిద్దిపేట

రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా సిద్దిపేటలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు నివాసంలో ఘనంగా రాఖీ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కచెల్లెళ్ళకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని రాజనర్సు ఆకాంక్షించారు.

నవతెలంగాణ-సిద్దిపేట

రాఖీ పౌర్ణమి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ఇచ్చిన ఏకో ఫ్రెండ్లి రాఖీ కార్యక్రమం పిలుపు మేరకు గురువారం తమ కుటుంబ సభ్యులకు ఏకో ఫ్రెండ్లి రాఖీలను మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు కట్టారు. మామిడి, తమల, నవరత్న ఆకులు, చామంతి, గులాబీ, మొలకెత్తే విత్తనాలతో తయారు చేసిన రాఖీలను కట్టినారు.

నవతెలంగాణ - దౌల్తాబాద్

రాఖీ పండుగ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావుకు మండల పరిధిలోని దీపాయంపల్లి గ్రామ ప్రథమ పౌరురాలు నారెడ్డి లావణ్య నరసింహారెడ్డి గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాఖీ కట్టి అన్నా చెల్లెల అనుబంధాన్ని గుర్తు చేశారు.

నవతెలంగాణ-రాయపోల్

అన్నా చెల్లెల ఆత్మీయ అనుబంధానికి, రక్తసంబంధాలకు ప్రతీక రక్షా బంధన్. గురువారం రాయపోల్ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రజలందరూ ఉత్సహంగా రాఖీ వేడుకలు నిర్వించారు. రాఖీ పండుగ అనగానే అన్న చెల్లెల, అక్క తమ్ముళ్ళ మధ్య ఆత్మీయ అనురాగాలు, రక్త సంబంధాలకు ప్రతీకగా నిర్వంచుకోవడం జరుగుతుంది. సమాజంలో జరిగే అఘాయిత్యాల నుంచి మహిళలను రక్షించడానికి సోదరులు భరోసా కల్పిస్తారు. ఎన్నో అసాంఘిక కార్యకలాపాలకు, దుర్ఘటనలకు, చెడు వ్యసనలకు యువత అలవాటు పడుతూ వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, అలా యువత వారి జీవితాలను అంధకారం చేసుకోకూడదని బాల్య దశ నుండే పిల్లలకు వినయం, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన నేర్పించాలన్నారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలి. ఒకరికొకరు రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళిలికి ఆయన తోబుట్టువులు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు తినిపించి నిరాడబరంగా రాఖీ పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ అత్యంత ప్రేమ అభిమానాలతో అక్కాచెల్లెళ్లు అన్న తమ్ముళ్లు సంతోషంగా చేసుకునే పండుగ రాఖీ పండుగన్నారు. అందరూ ప్రేమభావంతో ఉంటూ సోదర భావం పెంపొందాలని, అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-మిరు దొడ్డి

అన్న చెల్లెల మధ్య ప్రేమను రాగాలను తెలియజేసే పండుగ రక్షాబంధన్. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల వ్యాప్తంగా రాఖీ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. పండుగను పురస్కరించుకొని ఉదయం నుండి అక్క చెల్లెలు సోదరులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కష్టంలో తోడుండే అన్నయ్యకు గుర్తుగా రాఖీలు కట్టడం సంతోషంగా ఉందని సోదరిలు తెలియజేశారు. రాఖీ పండుగను పురస్కరించుకొని తోబుట్టువులు సొంత ఇంటికి రావడంతో ప్రతి ఇంటిలో పండుగ వాతావరణం నెలకొంది. రాఖీలు కట్టి అక్కా చెల్లెలు అన్నయ్యలకు శుభాకాంక్షలు తెలియజేయగా, సోదరులు అక్కాచెల్లెళ్లకు కానుకలు ఇచ్చి ప్రేమను చాటుకున్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలో రక్షా బంధన్ పండుగను తోబుట్టువులు గురువారం ప్రేమానురాగాలతో నిర్వహించుకున్నారు. సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టుకుంటూ అనుబంధానికి ప్రతీకగా నిలిచారు. సోదరి సోదరిమణుల బంధానికి రాఖీ పండుగ ప్రత్యేకతను చాటింది.

నవతెలంగాణ-సిద్దిపేట

రాఖీ పౌర్ణమి సందర్భంగా చెల్లెలు, అక్కలు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి పండుగను ఘనంగా చేసుకున్నారు. పట్టణంలో రాఖీ పండుగ సందర్భంగా అనేక రాఖీ సెంటర్లు వెలిసాయి. స్వీట్ షాపుల వద్ద, రాఖీ సెంటర్ల వద్ద కొనుగోలుదారులతో జన సందోహంగా మారాయి. వివిధ ప్రాంతాలకు వచ్చిపోయే మహిళలతో పాత బస్టాండ్‌లో పరిసర ప్రాంతాలు ప్రజలతో కిక్కిరిసిపోయాయి. ఆర్టీసీ బస్సులలో ప్రయాణికుల రద్దీ కనిపించింది.

నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్‌కు గురువారం హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎడబోయిన రజని, వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు కొంకటి నళిని దేవి, పెరుక భాగ్య రెడ్డి, గూల్ల రాజు, జనగామ రత్నమాల, బొజ్జ హరీష్, వాలా సుప్రజ నవీన్ రావు, మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న ,మాజీ జెడ్పిటిసి బిల్లు నాయక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొమురవెల్లి

ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డికి మర్రి ముచ్చాల సర్పంచ్ బోడిగం పద్మకిష్టారెడ్డి రాఖీ కట్టారు. గురువారం రాఖీ పండుగ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులతో కలిసి హైదరాబాదులోని ఆయన నివాసానికి వెళ్లారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని నియోజకవర్గంలో మెజారిటీ నాయకులు బలపరుస్తున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్ పల్లానే అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. ఆయన నేతృత్వంలో జనగామ నియోజకవర్గం మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. పల్లాను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తే భారీ మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి, బోడిగం కిష్టారెడ్డి, యువ నాయకులు వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ -గజ్వేల్

రాఖీ పండుగ సందర్భంగా గురువారం తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డిని సీఎం మినీ క్యాంప్ కార్యాలయంలో కలిసి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు రాఖీ కట్టారు. రాఖీ శుభాకాంక్షలు తెలిపి ఆయనను ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పండుగ ప్రత్యేకగా నిలుస్తుందన్నారు. ఎంత దూరం ప్రాంతమైన అన్నదమ్ముల కోసం తోడబుట్టువు వచ్చి రాఖీలు కట్టి వెళ్తుందన్నారు. అక్క చెల్లెల అనురాగానికి అన్నదమ్ముల అనుబంధానికి రాఖీ పండుగ నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు రజిత గౌడ్, శిరీష రాజు, శ్యామల మల్లేశం యాదవ్, మరికంటి వరలక్ష్మి కనకయ్య, గజ్వేల్ మాజీ సర్పంచ్ ఉప్పల పద్మ మెట్టయ్య రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నవాజ్ మీరా, గుంటుక రాజు, మర్చంట్ కనకయ్య, హైమద్, బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

సోదర, సోదరీమణులు మధ్య అనురాగబంధాన్ని ఆవిష్కరించే పండుగ రాఖీ పౌర్ణమి వేడుకలు నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా సోదరభావాన్ని, ఏకత్వ స్ఫూర్తిని చాటి చెప్పే రక్షాబంధన్ వేడుకలు ప్రతి ఇంట్లో జరిగాయి. ఒకరినొకరు పలకరించుకుంటూ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రక్షాబంధన్ వేడుకల్లో కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని బాలసదనంను జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించారు. మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ శిశు గృహ నూతనంగా నిర్మించిన భవనంలో డార్మెటరీ గదులు పూర్తైన నిర్మాణాలను పరిశీలించారు. అందులో ఏర్పాటు చేసిన ఆట వస్తువులను పరిశీలించి పిల్లలను చూసుకునే ఆయాలతో మాట్లాడారు. ఇటీవలే విక్రయాలకు గురవుతూ పట్టుకుని చేర్చుకున్న పిల్లలు గౌతమ్ (3సం), తరుణ్ (18నెలలు), 2 నెలల బాలిక యొక్క యోగక్షేమాలు తెలుసుకున్నారు. పిల్లలను చేర్చుకున్న విధానం గుర్చి రికార్డులను ప్రతి ఒక్కటి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పిల్లలకు కొత్త బట్టలు బహుకరించారు. చిన్న పిల్లలకు సిబ్బంది ఎక్కువగా ఉన్నారని, పిల్లలను అత్యంత జాగ్రత్తగా చేసుకోవాలని తెలిపారు. విసిటర్ రిజిస్టర్డ్‌లో చాలా బాగా సేవలు అందిస్తున్నారు, ఇలాగే కొనసాగేలా పని చేయాలని అధికారులకు సూచించారు. గదుల పక్కనే మరుగుదొడ్లను నిర్మించేలా ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి తప్పనిసరిగా అందుబాటులో ఉండే విధంగా మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామని హమి ఇచ్చారు. త్వరలో మంత్రి హరీశ్ రావు చేతుల మీదుగా డార్మెటరీ గదుల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని డీడబ్ల్యూవోకి తెలిపారు. బాలసదనంలో ఉన్న బాలికలను ఆప్యాయంగా పలకరించారు. స్వయంగా పిల్లలే చేసిన కాగిత పుష్పాలను వారి వద్దకెళ్లి స్వీకరించారు. పిల్లలతో మంగళహారతి తీసుకుని రాఖీ కట్టించుకుని లడ్డూ తిన్నారు. బహుమతిగా ప్రతి ఒక్క బాలికకు కొత్త బట్టలు అందజేశారు. అందరు కీర్తించేలా చదువాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అక్షింతలతో ప్రతి ఒక్కరిని ఆశీర్వదించారు. ఎలాంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పిల్లలకు అన్ని వసతులు కల్పించి కన్న బిడ్డలకంటే ఎక్కువ ప్రేమ పంచాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ, సదనం సిబ్బంది రమ, రాము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే అబాండాలు

- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో హుస్నాబాద్ అభివృద్ధి
- నిరాధారమైన ఆరోపణలు తగదు
- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్



నవతెలంగాణ-కోహెడ

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అబాండాలు వేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మండలంలోని నకిరెకొమ్ముల గ్రామంలో పర్యటించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌పై విషం చిమ్ముతున్నాడన్నారు. రాష్ట్రం చిన్న గ్రామాలను గుర్తించి గ్రామ పంచాయితీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కెసీఆర్‌దేనన్నారు. నకిరెకొమ్ముల గ్రామాని స్వరాష్ట్రంలో గ్రామపంచాయితీగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే దత్తత గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అబాండాలు వేస్తూ పబ్బం గడుపుతున్నారని ఆయన గ్రామానికి ఎంతగానో సేవ చేశారని, వంతెనను సైతం నిర్మించేందుకు సహకరించారన్నారు. గండిపెల్లి గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చెసి ఇక్కడి ప్రజల రైతాంగానికి సాగు నీరు అందించేందుకు కృషి చేశారన్నారు. అలాగే మండలంలోని శనిగరం ప్రాజెక్ట్ అభివృద్ధికి సుమారు 23 కోట్ల నిధులను మంజూరి చెసేందుకు మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సహకారం ఉందన్నారు. అలాగే మండలంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్‌లు, చెక్‌డ్యాంలు, మిషన్ కాకతీయ లాంటి పథకాలలో మండల అభివృద్ధికి నిధులు సమకూర్చేందుకు ఎంతగానో సహకరించారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ ఖదీర్, రైతు సమన్వయ సమితి జిల్లా నాయకులు ఇప్పరపల్లి కృష్ణమూర్తి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ పేర్యాల రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ తిప్పారపు శ్రీకాంత్, మాజీ జెడ్పిటిసి పొన్నాల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పెరుగు నరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నాగరాజు మధుసూదన్‌రావు, కొక్కుల సురేష్ , పాము శ్రీకాంత్, కొయ్యడ పరుశురాంగౌడ్, లోనే మల్లేశం, ఎంపీటీసీ వేముల శ్రీనివాస్, అబ్దుల్ రహీం, మండల బీసీ సెల్ నాయకులు కోపగోని సుభాష్, ఉపసర్పంచ్ యాద అశోక్, దేవేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు వేల్పుల శంకర్, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు సైఫోద్దిన్, యూత్ మండల ఉపాధ్యక్షులు తోట రాజ్ కుమార్, యూత్ జనరల్ సెక్రెటరీ చిట్యాల సుమన్, నాయకులు వజ్జపల్లి శ్రీనివాస్, గుగ్గిళ్ల కార్తిక్, తిప్పారపు అనిల్, రాజు, బండ వెంకటస్వామి, పోలవేని కుమారస్వామి, రవీందర్‌రెడ్డి, మాధవరావు, బబ్బురు శ్రీనివాస్, పెసరు సుధాకర్, రాజమౌళి, మంద రాజయ్య, మంద మల్లేశం, తలారి నర్సయ్య, ఆరె జగదీష్, గర్రెపల్లి వేణు, శేఖర్, సుదర్శన్, రవీందర్‌రావు, కుమార్, రాకేష్, సాయి, తిరుపతిరెడ్డి, అజయ్, శ్రావణ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మెదక్
శుక్రవారం | సెప్టెంబర్ 01 2023 | www.navatelangana.com

గ్రామ గ్రామానికి బీఎస్పీని బలోపేదం చేద్దాం

నవ తెలంగాణ మునిపల్లి

గ్రామ గ్రామానికి బీఎస్పీని తీసుకుపోయి ప్రగతి భవన్‌కు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పంపుదామని అందోల్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి జోగు ప్రసాద్ అన్నారు. అందోల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో "గడపగడపకు బీఎస్పీ ప్రగతి భవన్ కు ఆర్.ఎస్.పి" అనే నినాదంతో జరుగుతున్న ప్రచార ఉద్యమంలో భాగంగా నేడు మునిపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న బీఎస్పీ కార్యకర్తలతో బుధేరా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అందోల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి డా.ముప్పారం ప్రకాశం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జోగు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాభివృద్ధి కోసం నిర్మించుకున్న భారత రాజ్యాంగం అమలు చేయూత కానీ పాలకులు, సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, ఆ మోసాన్ని గడపగడపకు బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రజలకు వివరిస్తూ ఈ రాష్ట్రానికి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ముఖ్యమంత్రి అయితేనే పేద ప్రజల బతుకులు మారుతాయని ప్రచార ఉద్యమాన్ని కొనసాగిస్తూ బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) నిర్మిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మునిపల్లి మండల బహుజన సమాజ్ పార్టీ (బిఎస్పీ) అధ్యక్షులుగా కృష్ణంగారి ప్రశాంత్ ప్రధాన కార్యదర్శిగా మ్యాతరి విజయ్ తో పాటు 50మంది సభ్యులతో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని పాతబస్టాండ్ చౌరస్తా వద్ద గురువారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి జన్మదిన వేడుకలను యూత్ అధ్యక్షుడు జాలిగాం శంకర్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, టపాసులు పేల్చి ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయికృష్ణ ప్రయివేట్ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆవుల మహేందర్, వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ ఖదీర్, రైతు సమన్వయ సమితి జిల్లా నాయకులు ఇప్పరపల్లి కృష్ణమూర్తి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ పేర్యాల రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ తిప్పారపు శ్రీకాంత్, మాజీ జెడ్పిటిసి పొన్నాల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పెరుగు నరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నాగరాజు మధుసూదన్‌రావు, కొక్కుల సురేష్ , పాము శ్రీకాంత్, కొయ్యడ పరుశురాంగౌడ్, లోనే మల్లేశం, ఎంపీటీసీ వేముల శ్రీనివాస్, అబ్దుల్ రహీం, మండల బీసీ సెల్ నాయకులు కోపగోని సుభాష్, ఉపసర్పంచ్ యాద అశోక్, దేవేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు వేల్పుల శంకర్, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు సైఫోద్దిన్, యూత్ మండల ఉపాధ్యక్షులు తోట రాజ్ కుమార్, యూత్ జనరల్ సెక్రెటరీ చిట్యాల సుమన్, నాయకులు వజ్జపల్లి శ్రీనివాస్, గుగ్గిళ్ల కార్తిక్ పాల్గొన్నారు.

రిపోర్టర్ వేణుమాధవ్ మృతిపై మంత్రి సంతాపం



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

గజ్వేల్ పట్టణానికి చెందిన రిపోర్టర్ అర్కనపల్లి వేణు మాధవ్ మృతి పట్ల సంతాపం తెలియచేస్తూ వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్న వయస్సులోనే వేణు మరణించడం అందరిని కలచి వేసిందన్నారు. వారి కుటుంబాన్ని వ్యక్తిగతంగా,పార్టీ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. రిపోర్టర్ వేణు ఎంతో చురుకుగా ఉండేవాడని అలాంటి వాడు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని అన్నారు.కుటుంబ సభ్యులకు తీరని దుఃఖం మిగిలించి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా జీవితంలో వాటిని ఎదిరించి అధిగమించాలని అన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తల్లిదండ్రులు, భార్య పిల్లలు, మనోధైర్యంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.

గజ్వేల్‌లో జర్నలిస్టు ఆత్మహత్య





నవ తెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ కేంద్రంగా ఓ పత్రికలో పనిచేస్తున్న రిపోర్టర్ వేణు మాదవ్(34) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన అతను బుధవారం ఉదయం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేణు ఆచూకీ కోసం రంగంలోకి దిగిన పోలీసులు, గజ్వేల్ పట్టణంలోని ఎర్రకుంటలో అతని మృతదేహాన్ని కనుగొన్నారు. ఆన్లైన్ అప్పుల భారం, వాటి వేధింపులు భరించలేక వేణు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, రెండేళ్ల వయస్సున్న ఇద్దరు కవల ఆడ పిల్లలున్నారు. గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టు ను డీ కొని వ్యక్తి మృతి

-నవతెలంగాణ -సిద్దిపేటరూరల్

పాల కేంద్రం లో పాలు పోసేందుకు వెళ్తున్న యువకుల బైక్ కల్వర్టును డీ కోట్టన సంఘటనలో ఒక యువకుడు అక్కడికక్కడే మరణించగా, మరో యువకుడి పరిస్థితి విషమంగా మారింది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుబ్బాక మండలం దర్మాజిపేట గ్రామానికి చెందిన బూర పర్శరాములు కోడుకు స్వామి బుధవారం రాత్రి 9 గంటల సమయంలో పాలకేంద్రం పాలు పోసేందుకు తన స్నేహితుడు సాయి తో కలసి బైక్ పై వెళ్తుండగా సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల గ్రామ శివారు అప్పనపల్ల గ్రామ శివారు మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కల్వర్ట్ నుగుద్ది అక్కడి నుండి కాలువలో పడింది. దీంతో ఆ రోడ్డు పై వెళ్తున్న కోంతమంది గుర్తించి, 108 కు సమాచారం ఇవ్వగా, వారు యువకులను సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు.

పోలీసులు కావలెను!

- ఝరాసంగం పోలీస్ స్టేషన్లలో సిబ్బంది లేక ఇబ్బందులు
- పూర్తి స్థాయిలో సేవలు అందని దుస్థితి
- ప్రముఖులకే పోలీసుల సేవలు పరిమితం
- పరిస్థితి ఇలానే ఉంటే ఎన్నికలు గట్టెక్కేనా?
- పట్టించుకోని ఉన్నతాధికారులు





నవతెలంగాణ-ఝరాసంగం

ప్రజలకు శాంతిభద్రతలతో పాటు రక్షణ కల్పించేందుకు ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్‌లో సరిపడా సిబ్బంది లేక పూర్తిస్థాయిలో పోలీసులు సేవలందించకపోతున్నారు. చాలా కాలంగా ఉన్న సిబ్బంది తోనే విధులు నిర్వహిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం ఝరాసంగం పోలీస్ స్టేషన్లో 22 మంది మాత్రమే విధినిర్వహణలో ఉన్నారు. దీంతో ప్రజలకు సరైన సమయంలో తగిన సేవలు అందకుండా పోతున్నాయి. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొత్తం 41 మంది సిబ్బంది ఉండాలి. అందులో ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు ఎస్‌ఐలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుల్ తో పాటు 30 మంది కానిస్టేబుళ్ల ఉండాలి. ఆ విధంగా పూర్తి స్థాయిలో సిబ్బంది ఉంటే మండల వ్యాప్తంగా ఉన్న 33 గ్రామ పంచాయతీలో 2011 జనాభా లెక్కల ప్రకారం 44,583 మందికి మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. మండలంలో మూడు గ్రామాల్లో ప్రతి వారం సంతలు జరుగుతాయి. ఝరాసంగంలో సోమవారం,బర్దిపూర్ లో గురువారం,మచ్నూర్ లో ఆదివారం వ్యాపారాలు కొనసాగుతాయి. ప్రస్తుతం పెరిగిన జనాభాకు సరైన సమయంలో రక్షణ కల్పించడంతో పాటు ఎలాంటి అక్రమ వ్యాపారాలు కొనసాగకుండా అడ్డుకొగలుగుతారు. కానీ ప్రస్తుతం స్టేషన్లో 22 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరూ ఏ ఎస్ ఐ లు,6 మంది హెడ్ కానిస్టేబుల్లు, 19 మంది కానిస్టేబుల్లు ఉన్నారు.

నిత్యం రోజువారీ పనులే..

మండలానికి 30 మంది కానిస్టేబుల్స్ ఉండాలి. కాని ప్రస్తుతం స్టేషన్లో 19 మంది మాత్రమే ఉండగా వీరిలో అటచిడ్ పై వివిధ కార్యాలయానికి వెళ్ళిన వారు 7 మంది కాగా, ఒకరు కోర్టు డ్యూటీ, ఒక్కరూ సీసి టి ఏన్ ఎస్ (ఆన్లైన్), మరొకరు రైటర్ గా పని చేస్తుండగా, ఇంక్కోకరకు ఫిర్యాదులు తీసుకునేందుకు నిత్యం పోలీస్‌స్టేషన్లో ఉండాల్సి వస్తోంది. మిగిలిన 8 మంది మాత్రమే ఉన్నారు. వీరితో మాత్రమే మండల ప్రజలకు రక్షణ కల్పించాల్సి వస్తోంది దీంతో వారికి నిత్యం పని తప్ప ఏ ఒక్క గంట తీరిక దొరకడం లేదు.

కేతకీ ఆలయానికి నిత్యం ప్రముఖులు రాకతో..

మండల కేంద్రంలో జిల్లాలోనే అతి ప్రఖ్యాతిగాంచిన శ్రీ కేతకి సంగమేశ్వర దేవాలయానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు జడ్జీలు, జిల్లా స్థాయి అధికారులు, ప్రముఖ ప్రజా ప్రతినిధులు రావడంతో కొంత సమయం కోల్పోతున్నారు. దీంతోపాటు జిల్లా కేంద్రాల్లో,హైదరాబాద్ లో జరిగే పలు ఉత్సవాలకు పార్టీ సభలకు ఇక్కడి నుంచి ఎస్‌ఐతోపాటు సిబ్బందిని బందోబస్తుకు పంపిస్తున్నారు. దీంతో మండల ప్రజలకు పోలీసుల సేవలు అందకుండా పోతున్నాయి. పోలీస్ స్టేషన్ కు ఏదైనా దరఖాస్తులు ఇస్తే సిబ్బంది సరిపడా లేని కారణంగా రెండు, మూడు రోజులు స్టేషన్ చుట్టూ తిరిగి తమ సమస్యలు పరిష్కరించుకోవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రజలకు సరైన సమయంలో పోలీసు సేవలందించేందుకు సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా అధికారులకు నివేదించాం



స్టేషన్‌లో సిబ్బంది కొరత విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. పూర్తి స్థాయి సిబ్బంది లేని మాట వాస్తవమే. ఇప్పటికీ కొంత ఇబ్బందులు ఎదురవు తున్న మెరుగైన సేవలు అందిస్తున్నాం త్వరలో కొత్త సిబ్బందిని నియమిస్తామనీ అధికారులు చెబుతున్నారు. పూర్తిస్థాయి కానిస్టేబుల్ ఉండి ఉంటే ప్రజలకు అవసరమైన సేవలు వెంటనే అందించే వాళ్ళం.


– రాజేందర్ రెడ్డి ఎస్సై ఝరాసంగం

వానరసేన స్వైర విహారం

- బెంబేలెత్తుతున్న జనాలు
- కోతుల మందలను చూసి జంకుతున్న జనం
- జిన్నారంలో ఏళ్ల తరబడిగా వేధిస్తున్న కోతుల సమస్య
- పంటల సీజన్లోనూ ధాన్యంపై దాడులు
- మనుషులు ఉండగానే దర్జాగా ఇళ్లల్లోకి చొరబాటు
- వస్తువులన్నీ చిందరవందర చేస్తున్న కోతులు
- ఫారెస్ట్ అధికారులూ మీరెక్కడ?









నవతెలంగాణ జిన్నారం

మా పరిస్థితి ముందు నెయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా మారింది. మమ్మల్ని వేధిస్తున్న సమస్య కోతుల బెడద అంటూ మండల కేంద్రమైన జిన్నారం వాసులు లబోదిబోమంటున్నారు. గడిచిన రెండు రోజుల కింద ఓ యువకుడి వాహనంపై దాడి చేసి సీట్ కవర్ను పూర్తిగా ధ్వంసం చేశాయి. ఉదయం లేచింది మొదలు ఇళ్లల్లోకి మందులుగా కోతులు రావడం, కిరాణా షాపుల్లోకి, బేకరీలోకి ఇక్కడ అక్కడ అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడికి కోతులు రావడం తమ పాలిట శాపంగా మారింది అంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఒంటరిగా రోడ్డుపై వెళ్తున్న వారిని కూడా కోతులు దాడి చేసి గాయపరుస్తున్నాయంటున్నారు. ప్రధానంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లల పరిస్థితి కోతుల వల్ల మరింత ఇబ్బందికరంగా మారిందంటూ పలురు తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇంట్లో కూర్చొని టీ తాగుతున్న పలువురు మహిళల పై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన దాఖలాలు ఉన్నాయన్నారు. అలాగే ఆరు బయట బోళ్లు తోముతున్న పలువురు మహిళలపై కూడా కోతులు దాడి చేసి గాయపరిచాయాంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆహార పదార్థాలను ఇళ్లలో చిందరవందరగా చేయడం ఇలాంటివి నిత్యకృతంగా మారడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది అంటున్నారు. కాగా ఈ విషయమై పలుమార్లు అటవీ అధికారులకు విన్నవించిన ఫలితం లేకపోయింది అంటూ వాపోతున్నారు.

భయపడుతున్న జనాలు

వివిధ పనుల నిమిత్తం బయటకి వెళ్లిన సందర్భంలో అకస్మాత్తుగా దారిలో కోతుల గుంపులు కనిపించినట్లయితే అవి తమపై దాడి చేస్తున్నాయి అంటూ పలువురు వృద్ధులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి అధికార యంత్రాంగం జిన్నారం గ్రామాన్ని కోతుల బెడద నుంచి రక్షించాలని వారు కోరుతున్నారు.

ఫారెస్ట్ అధికారులు స్పందించరా?

మండల కేంద్రమైన జిన్నారంలో సంవత్సరాల తరబడిగా కోతుల బెడద స్థానిక జనాలను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్న మీరు పట్టించుకోరా అంటూ ఫారెస్ట్ అధికారుల తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, తరచుగా పోతుల దాడుల వలన గాయాల పాలవుతూ అనారోగ్యానికి గురవుతున్నారు అన్నారు. కోతులను పూర్తిగా ఈ ప్రాంతం నుంచి తరలించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తూ శాశ్వతంగా తమకు కోతుల బాధ నుండి రక్షించే ప్రణాళికలను అమలు చేయాలంటూ ఫారెస్ట్ అధికారులను కోరుతున్నారు. కోతుల తరలింపుపై అందరూ సమిష్టిగా దృష్టి సారించాలని జిన్నారం వాసులు కోరుతున్నారు

కాపాడండి



జిన్నారం గ్రామంలో కోతుల వల్ల తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్న దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించి తగిన కార్యాచరణ రూపొందించాలని జిన్నారం గ్రామానికి చెందిన యువకుడు విష్ణుమూర్తి విజ్ఞప్తి చేశారు. మందలు మందలుగా ఉంటున్న కోతులను ఈ ప్రాంతం నుంచి అధికార యంత్రాంగం ఫారెస్ట్ వారి సహకారంతో తరలించేందుకు తగిన ఏర్పాట్లను వెంటనే చేయాలని ఆయన కోరారు.

– విష్ణుమూర్తి


కొత్తకలాలు.. సరికొత్తగా..

నవతెలంగాణ-సిద్దిపేట

తెలుగు సాహిత్యంలో బాలసాహిత్యం ఓ బలమైన పార్శ్వం. ఇది రెండు పాయలుగా సాగి సాహిత్య క్షేత్రాన్ని మరింత సుసంపన్నం చేస్తూ వస్తున్నది. బాలలకోసం బాలలు రాయడం ఒక పద్ధతైతే, బాలల కోసం పెద్దలు రాయడం మరో పద్ధతి. కవిత్వం, కథ, జీవిత చరిత్రలు, ఇలా భిన్న ప్రక్రియల్లో రచనలు సాగుతూ బాలల లోకంలో మనోవికాసంతో పాటు సృజనను కూడా బలోపేతం చేయడం మనం గమనిస్తాం. ఇటీవల కాలంలో అధ్యాపకులు తాము కవులు, కవయిత్రులుగా రాణిస్తూనే అంతటితో ఆగకుండా విద్యార్థులలో కూడా సాహిత్యం పట్ల అభిరుచిని కలిగిస్తూ వారిలో సహజంగానే దాగివున్న సృజనను బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు. పద్యం, గద్యం రెండింటా సమాంతరంగా తమ ప్రతిభను చాటుకుంటున్నారు పిల్లలు. ఎడ్ల శ్రీకాంత్ రెడ్డి లాంటి బాల సాహితీ విద్యార్థి అవధానాలు చేసి "ఔరా "అని పెద్దలచే తలలూపించుకున్న సందర్భాలు ఉన్నాయి. ఏదేమైనా ఆయా పాఠశాలల నుంచి ఇలా "కొత్తకలాలు "తమదైన శైలిలో లేత కవితాక్షరకిరణాలను ప్రతిభావంతంగా లోకం పైకి ప్రసరింపజేయడం శుభపరిణామం.

సిద్ధిపేటగడ్డ.. బాల సాహిత్యపు అడ్డా

సిద్దిపేట అనగానే ఒక చైతన్యం మన కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది. ఇక్కడినుండి అనేకమంది సాహితీవేత్తలు, కళాకారులు తమదైన వాణితో, బాణితో, రాణించిన, రాణిస్తున్న సందర్భాలు కోకొల్లలు. బాలసాహిత్య విషయానికి వస్తే వేముగంటి నరసింహాచార్యులు, ఐతాచంద్రయ్య, అమ్మన చంద్రారెడ్డి, సామలేటి లింగమూర్తి, గరిపెల్లి అశోక్, ఉండ్రాళ్ళ రాజేశం, పెందోట వెంకటేశ్వర్లు, ఎన్నవెల్లి రాజమౌళి, వర్కోలు లక్ష్మయ్య,గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ ఇట్లా అనేక మంది కవులు బాలసాహిత్యాన్ని అందిస్తూ వస్తున్నారు. ఆ క్రమంలో దుబ్బాక బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న శివునూరి లలితాకృష్ణ స్వతహాగా కవయిత్రి, రచయిత్రి, గొప్ప గాయని. సాహిత్యసేవాసంస్థల నిర్వాహకురాలు. చైతన్యం మూర్తీభవించిన కార్యకర్త. ఆమె సంపాదకత్వంలో ఈ దుబ్బాక ఉన్నత పాఠశాల బాలికలు రాసిన కవితలను ఓ కవితాగుచ్ఛంగా మనకు అందిస్తున్నారు. రేపటి కవితాసూర్యుళ్ల వెలుగులకు ద్వారాలు తెరుస్తున్నారు. ఈ సంకలనంలో మొత్తం 82 కవితలు ఉన్నాయి. వస్తువైవిధ్యంతో పాటు, వ్యక్తీకరణలో కూడా విద్యార్థులు ప్రదర్శించిన పదపోహళింపునూ ఇక్కడ మనం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సంప్రదాయన్ని గౌరవిస్తూ తొలికవితలో గణపయ్యను స్మరించుకుంది అక్షయ. మావూరు, జాతీయపతాకం, అమ్మ, చదువు, ఆడపిల్ల, బతుకమ్మ, భాష, దీపావళి, స్నేహం, బడిగంట, నాన్న, స్త్రీ, సరస్వతి, తెలుగు, చెట్టు, అన్న, బాల్యం, బడి, పల్లె, నల్లబల్ల, పాఠం, రైతు, సైనికుడు,.... ఇలా పలు వస్తువులను తమ కవిత్వానికి నేపథ్యంగా ఎంచుకొని తమదైన భావాలను అలతి అలతి పదాలలో ఆవిష్కరించారు. కవిత్వపు తూగురాళ్ళవైపు మొగ్గు చూపకుండా పిల్లల భావవ్యక్తీకరణ వైపే పాఠకులు ఓటు వేస్తారని, వెయ్యాలన్న ఒక అభిప్రాయం కలుగుతుంది. ఈ సంకలనంలోని కవితలు చదివాక మనలో ఒక తెలియని అనుభూతి కలుగుతుంది. తేటపదాలతో విద్యార్థులు తమలోని భావాలను ఎంత గొప్పగా ఆవిష్కరించారో ఇక్కడ మనం గమనించవచ్చు. ప్రకృతిలో పచ్చదనం, అవని ఒడిలో వెచ్చదనం(నయనశ్రీ), మనిషికి ఉండాలి మంచితనం,తెస్తుంది అదే గొప్పతనం (విజయశ్రీ), విజయం సాధిస్తే మురువు (అక్షయ), సహనానికి ఉన్న శక్తి జగమంతా తెలిపేను జనులందరికీ జాతీయజెండా (మానస), చదువుతోనే భవిత (నస్రీన్), కోవెల అంటే కొండంత ఇష్టం (ప్రజ్ఞ), మా గురువుల బోధనే మాకు బూస్ట్ (సిరిచందన), అలుపు లేకుండా గెలుపు, గెలుపుతో చక్కని మలుపు (శ్రీజ), రమ్మని పిలిచెను బతుకమ్మ (ప్రతిభ), నింగిని పిలుస్తూ నేల, నేలను తలుస్తూ నింగి (లేఖశ్రీ), మాతృభాషే మనశ్వాస (భావన), నాన్నే నాకు మిన్న (సంజన), ఆదర్శాలకు నిలయం భారతదేశం (హేమలత), మానవతామూర్తే నాకెపుడు స్ఫూర్తి (నవ్య), చదువుల బడి మమతల గుడి (నేహ),కలలో అయ్యాను నేను క్వీన్ (హరిణి), మాతృభాషలో ఉంది జిలుగు, అది పంచుతుంది వెలుగు (శ్రీజ), పల్లెల్లో ఉంటాయి తెల్లని మనసులు (రేవతి), స్నేహితులు లేకుండా నేను నిలువ (వైష్ణవి), మంచిరాతతోనే గెలుపు, రాతతోనే మలుపు (రక్షిత), చెట్టు, ధరణికి తానే ఇంధనం (ఆనందిని), మంచితోనే ఆత్మవిశ్వాసం (నిఖిత), ఏకవచనంగా ఉన్న నేను, స్నేహితులతో కలిసి బహువచనమయ్యాను (సోఫియా పర్వేజ్), తరుగుతున్న సుద్దముక్క తెలివిని పెంచుతుంది (నందిని), మన పండుగలు చెప్తాయి మనమంతా ఒక్కటని (శిరిన్), బతుకునిచ్చేది జవాన్, మెతుకునిచ్చేది కిసాన్ ఇలా పలు కవితాపంక్తులను ఉదహరించుకోవచ్చు. ఎంతైనా వ్యాఖ్యానించుకోవచ్చు. ఇదీ బాలల కవితాహృదయం. రేపటి పచ్చని కవితాపందిళ్లకు వేసుకుంటున్న పునాదులు.



దుబ్బాకలోనే తొలి బాలల కవితాసంకలనం





సంకలనం రూపు కట్టడం ఒక యజ్ఞం వంటిదే. ఈ విషయంలో సంపాదకురాలు లలితాకృష్ణ పూలల్లో దారంలా అందరినీ సమన్వయం చేస్తూ అందమైన కవిత్వ దండనే అల్లారు. డి. ఈ. ఓ శ్రీనివాస్ రెడ్డి, ఎం.పి.డి.ఓ వేలేటి భాస్కరశర్మ, ఎం. ఈ. ఓ జోగుప్రభుదాస్, కేంద్రసాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డా.పత్తిపాకమోహన్, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. సత్యనారాయణ రెడ్డి రాసిన ముందుమాటలు బాలల కవిత్వం వెనుక మర్మాన్ని, సంపాదకురాలి కృషిని ఆవిష్కరిస్తు న్నాయి. మొత్తంగా బాలల కవితాప్రపంచంలో మరో మేలిమి సంకలనం రావడం ఆహ్వానించదగిన పరిణామం. ఈ పుస్తకం ఇలా వెలుగులోకి రావడానికి ఆర్థికంగా సహకరించిన కృతిస్వీకర్తలు గిరి -రజిత దంపతుల సౌజన్యాన్ని గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలుపుదాం దుబ్బాక ప్రాంతం నుంచి వెలువడిన తొలి బాలల సంకలనం ఇది. రేపటి అసంఖ్యాక సంపుటాలకు వాగ్దానం చేస్తుందని ఆశిద్దాం.

– డా. పోరెడ్డి రంగయ్య,
శివునూరి లలితాకృష్ణ

నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం 'తిరునగరి గోదావరి'

- మచ్చలేని మహిళా నాయకురాలిగా మండలంలో సరైన గుర్తింపు
- 1996లో విద్యావంతురాలు నుంచి రాజకీయాల్లోకి..
- కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ గా 3 సార్లు బాధ్యతల స్వీకరణ
- డ్వాక్రా సంఘాల్లో 32 గ్రామాలకు వలంటరీగా సేవలు



నవతెలంగాణ- కొల్చారం

ప్రజా సేవ చేయాలన్న దృక్పథంతో రాజకీయాల్లోకి మహిళ నాయకురాలిగా 1996 నుంచి ప్రజలకు ఎనలేని సేవలు చేస్తూ నేడు మండలంలోనే నిస్వార్ధ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనంగా, మచ్చలేని మహిళా నాయకురాలిగా సరైన గుర్తింపు చాటుకుంటున్నారు కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ తిరునగరి గోదావరి. గత కొన్ని సంవత్సరాల క్రితం నుంచి మహిళల పక్షాన ప్రతి సమస్యను లేవనెత్తి ఉద్యమాలు సైతం చేస్తూ.. ప్రజల మన్ననలను పొందుతూ తనదైన శైలిలో ముద్ర వేసుకుంది. అదేవిధంగా రాజకీయంగా ఎన్నో ఒడుదొడుగులను ఎదుర్కొని రాజకీయ అనుభవాలను సైతం అనుభవించి వివిధ రకాల సంఘాలను ఏర్పాటు చేస్తూ ప్రజా సమస్యలే ఎజెండాగా లేవనెత్తి ఉద్యమాలు సైతం చేస్తూ ప్రజల పక్షాన నిలబడ్డారు. 1996లో స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి గా పోటీ చేసి కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ గా అత్యధిక మెజార్టీతో అప్పట్లో ఘనవిజయం సాధించిన ఘటనత ఆమెకే దక్కింది. అలాగే 2003లో బిజెపి నుంచి సర్పంచ్ గా ప్రతినిత్యం వహించారు. 2018లో చాత్తాద సంఘం జిల్లా అధ్యక్షురాలు గా కొనసాగుతూ ఉత్తమ మహిళా నాయకురాలి గా అవార్డును సైతం అందుకున్నారు. ఇలా అంచెలంచెలుగా ఎదుగుతూ 2019లో ఆమె రాజకీయ అనుభవాలను తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి స్వయంగా ఆమెను కలిసి ఇలాంటి నాయకురాలు టిఆర్ఎస్ పార్టీకి అవసరమని పార్టీలోకి ఆహ్వానించడమే కాకుండా సర్పంచ్ స్థానాన్ని ఆమెకు కట్టబెట్టారు. దీంతో 2019 పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా పోటీ చేసి అత్యధిక మెజారిటీ తో గెలుపొంది ప్రజాసేవకు నిదర్శనంగా నిలుస్తున్నారు.


1976లో టెలికాం డైరెక్టర్‌గా..

1976 సంవత్సరంలో టెలికామ్ డైరెక్టరుగా పనిచేసిన ఆమె అప్పట్లో కొల్చారం మండలానికి టెలికాం లైన్ ను తీసుకువచ్చి ఎనలేని కృషి చేశారు. అంతేకాకుండా బిజెపి పార్టీలో సర్పంచ్ గా ప్రాతినిథ్యం వహిస్తున్న క్రమంలో గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా మండలంలోని రంగంపేట, సంగాయిపేట, కిష్టాపూర్ గ్రామాల రోడ్ల నిర్మాణానికి ప్రపోజల్ పంపిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఇలా ఎన్నో రకాలుగా సేవలు చేస్తూ ప్రజల మన్ననలు పొంది నేడు విశేష గుర్తింపును చాటుకోవడం పట్ల నేడు మండల ప్రజలు ఆమె అనుభవాలను గుర్తుకు తెచ్చుకుంటూ అభినందనీయం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌కు కమిటీ ఏర్పాటయ్యేనా?

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తూప్రాన్‌లో మార్కెట్ కమిటీ భవనాన్ని నిర్మించిరు కానీ కమిటీ ఏర్పాటులో అధికార పార్టీ నాయకులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటి వరకు వంటి మామిడి మార్కెట్ఓల ప్రతినిధ్యం ఉన్నప్పటికి మార్కెట్ విభజనతో తూప్రాన్ మనోహరాబాద్ మండలాలకు ఎలాంటి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. జిల్లాల పునర్విభజన అనంతరం వంటి మామిడి వ్యవసాయ మార్కెట్ నుండి విడిపోయిన తరువాత తూప్రాన్ మనోహరాబాద్ మండలాలకు కనీసం వ్యవసాయ మార్కెట్‌లో ప్రాతినిధ్యం కూడా లేకుండా పోయింది. నూతనంగా తూప్రాన్‌లోనే మార్కెట్ ఏర్పాటు కావడంతో ఇక్కడే రెండు మండలాలకు కలిపి కమిటీని ఏర్పాటు చేస్తారనే ఆలోచనతో ఉన్న ఆశా వాహ నాయకుల్లో కమిటీ ఏర్పాటులో జరుగుతున్న జాప్యంతో నాయకుల్లో నిరాశ నెలకొంటొంది. కమిటీ లేక పోవడంతో మార్కెట్ నిర్వాహణ లేక పాడుపడే పరిస్థితి నెలకొంది. మార్కెటింగ్ శాఖ అధికారులు తరుచు వచ్చి పరిస్థితిని చూసి వెల్లే పరిస్థితి నెలకొంది. అదే వ్యవసాయ మార్కెట్‌కు నూతనంగా కమిటీని ఏర్పాటు చేస్తే మార్కెట్ నిర్వహణ కమిటీ భాధ్యతగా ఉండడంతో నిర్వహిణ వారే చూసుకుంటారు. ముఖ్యమంత్రి



నియోజక వర్గంలోనే వ్యవసాయ మార్కెట్‌కు కమిటీని ఏర్పాటు చేయడంలో ఎందుకు ఆలస్యం జరుగుతుందో అర్థం కానీ పరిస్థితి. ఇప్పటికైనా తూప్రాన్ వ్యవసాయ మార్కెట్‌కు ఎప్పుడు కమిటీని ఏర్పాటు చేస్తారో అంటూ ఆశావాహ నాయకులు ఎదురుచూస్తున్నారు. తూప్రాన్ మనోహరాబాద్ మండలాలకు కలిపి నిర్మించిన వ్యవసాయ మార్కెట్‌ను నిర్మించినప్పటికి దానికి కమిటీని వేయకపోవడంతో ఆశావాహ నాయకులు కమిటీ ఏర్పాటుపై ఆశతో ఎదురుచూస్తున్నారు. ఒక వైపు ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇప్పటికైనా ప్రభుత్వం తూప్రాన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటుపై ఒక నిర్ణయం తీసుకుంటుందా అని ఎదురుచూస్తున్నారు. పార్టీలో ఇప్పటి వరకు ఎలాంటి పదవుల్లో లేకున్నప్పటికి కనీసం వ్యవసాయ మార్కెనెరట్లటనైనా పదవులు వస్తేయా అనే ఆలోచనతో ఉన్న నాయకుల్లో కమిటీ ఏర్పాటుపై ఆందోళన కొనసాగుతుంది.